ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
బుధవారం 24 ఏప్రిల్ 2024

జగనా.. నీకిది తగునా..!

- ఆసుపత్రులకు బిల్లులు పెండింగ్
- చికిత్సకు నిరాకరిస్తున్న ఆసుపత్రులు
- వైద్యం అందక రోగుల అవస్థలు
- ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వైనం
- అపహాస్యంగా మారిన ఆరోగ్యశ్రీ



అమ్మకు అన్నం పెట్టలేనోడు పిన్నమ్మకు పట్టు చీర కొనిస్తా అన్నాడట.. అచ్చం అలాగే ప్రస్తుత సీఎం జగన్ వ్యవహార శైలి ఉంది. తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ పేదల వైద్యం కోసం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకానికే పంగనామాలు పెట్టేశాడు. పేరుకు మాత్రం ఈ పథకంలో చికిత్సలు అందించే వ్యాధులు సంఖ్య 3వేలకు పైగా చేర్చారు. పరిమితి ఐదు లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచారు. కానీ ఆ మేరకు వైద్యం అందలేదు. కోట్ల రూపాయలు వ్యయం చేసి ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందించినట్లు డబ్బా కొట్టుకుంటూ.. సొంత పత్రికలో ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ పథకం పేదలకు చెప్పుకోతగ్గ స్థాయిలో అసరా ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్హులమైనా ఆరోగ్యశ్రీ వర్తించలేదు..



నా కూతురికి ఆరోగ్యం బాగలేక తిరుపతి సంకల్ప ఆసుపత్రికి వెళితే ఆరోగ్యశ్రీ ఎన్‌రోల్‌మెంట్ కాలేదు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకోండి ఖర్చు తగ్గుతుందని వైద్యులు చెప్పారు. వైద్యుల అడిగిన పేపర్లు అన్నీ ఇచ్చాము. ఆ పేపర్లను ఆసుపత్రి వాళ్ల అప్‌లోడ్ చేశారు. మూడు రోజుల గడిచినా ఎన్‌రోల్‌మెంట్ కాలేదు. ఎందుకు కాలేదని అడిగితే.. మాకేమీ తెలియదని ఆసుపత్రివాళ్ల చెప్పారు. దీంతో వేలు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నాం. అర్హులమైనా మాకు ఆరోగ్య శ్రీ వర్తించకపోవడం బాధగా ఉంది. మాలాగే ఎంతో మంది అర్హులకు ఆరోగ్య శ్రీ వర్తించలేదు.

- మాలేపాటి సురేశ్‌నాయుడు, సుండుపల్లె

ఆరోగ్యశ్రీ పథకం వల్ల ఇబ్బంది పడ్డాము



నా భార్య మోకాళ్ల నొప్పులతో కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతోంది. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేపించుకుందామని ఆసుపత్రిలో చేరాము. అన్ని రకాల పరీక్షలు చేయించి, మూడు రోజులు ఆసుపత్రిలో ఉంచుకొని ఆరోగ్యశ్రీ వర్తించదు అని చెప్పారు. దీంతో చిల్లర అంగడి నడుపుకుంటూ.. దాచుకున్న సొమ్మును పెట్టి ప్రైవేటుగా ఆపరేషన్ చేయించుకున్నాం. ఆపరేషన్‌కు 60 వేల రూపాయలు, తర్వాత మందులకు 40 వేల వరకు ఖర్చుఅయింది. ఆరోగ్యశ్రీని నమ్ముకుని.. లక్ష రూపాయలు ఖర్చుచేసుకున్నాం. మేము చేయించుకున్న ఆసుపత్రిలోనే, మాకు తెలిసిన వాళ్ల కూడా ఆరోగ్య శ్రీ వర్తిస్తుందని చేరి.. రెండు మోకాళ్ల ఆపరేషన్ చేయించుకొని సుమారు రూ.5 లక్షలు కట్టి వెళ్లారు.

- బి.చిన్నయ్య, చిన్నఓరంపాడు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. లక్షల రూపాయలు ఖర్చుచేసి ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు.. ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్.. 2009 లోనూ అధికారంలోకి రావడానికి ప్రధానంగా ఆరోగ్యశ్రీ పథకాన్నే చెప్పుకోవచ్చు. తండ్రికి పేరుతో పాటు.. అధికారపీఠం మరోసారి అధిష్ఠించడానికి ఉపయోగపడింది. ఇంతటి ప్రతిష్ఠాత్మక పథకాన్ని తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అటకెక్కించారు. కనీసం ఈ పథకం అమలు గురించి పట్టించుకోవడం లేదు. నిజంగా రోగులకు ఈ పథకం ఆసరగా ఉంటోందా.. లేదా అని పరిగణలోకి తీసుకోవడం లేదు.

చంద్రబాబు పాలనలో సైతం..

రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన తర్వాత.. ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిలు ఆరోగ్యశ్రీ పథకానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. తమ పాలనలో ఈ పథకం అమలుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు సైతం ఆరోగ్యశ్రీ పథకానికి అదే ప్రాముఖ్యతను ఇచ్చారు. గతంలో ఉన్న వ్యాధులకంటే.. మరిన్ని వ్యాధులను ఈ పథకం కిందకు చేర్చారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో ఏనాడూ ఈ పథకం అమలుపై ఇబ్బందులు తలెత్తలేదు. తమకు బిల్లులు బకాయిలు ఉన్నాయని ఆసుపత్రులు రోడ్డెక్కలేదు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కుర్చీ ఎక్కగానే.. ఆరోగ్యశ్రీకి అగచాట్లు మొదలయ్యాయి. వైద్య సేవలు అందించే ఆసుపత్రులకు బిల్లులు గుట్టల్లాగా పేరుకుపోయాయి. దీంతో విధిలేని స్థితిలో.. ఆయా ఆసుపత్రులు సైతం రోగులకు చికిత్స అందించడానికి వెనకాడుతున్నాయి. వెరసీ.. రాష్ట్రంలోని రోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

రూ. కోట్లలో ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రోగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఆసుప త్రులకు కోట్ల రూపాయలు బిల్లులు బకాయి పడింది. దీంతో పలుమార్లు ఈ ఆసుపత్రులు వైద్య సేవలు నిలిపేస్తూ.. తమ నిరసనను తెలిపారు. అటువంటప్పుడు కేవలం కంటితు డుపుగా రాష్ట్ర ప్రభుత్వం కొంతమొత్తంలో బకాయిలు విడుదల చేసేది. దీంతో ఆసుపత్రులు రోగులకు చికిత్స అందించడం మానేశాయి. ఈ నేపథ్యంలో రోగులు రోజుల తరబడి ఆసుప త్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీ కింద అప్రూవల్ అయితేనే.. ఆసుపత్రులు చికి త్సలు చేస్తుండడంతో... విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలు, లక్షల రూపాయలు వ్యయం చేసి వైద్యం చేయించుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని వాళ్ల.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని.. ఆరోగ్యశ్రీ కింద అప్రూవల్ అయ్యేంత వరకు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 75 ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు

అన్నమయ్య జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం వర్తించే ఆసుపత్రులు 75 ఉన్నాయి. అందులో 55 ప్రభుత్వ ఆసుపత్రులు, 20 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో జిల్లా ఆసుపత్రి 1, ఏరియా ఆసుపత్రులు 3, సీహెచ్‌సి 7, పీహెచ్‌సీ 44, ప్రైవేటు ఆసుపత్రులు 20 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ కోసం 5 మంది టీం లీడర్లు , 56 మంది ఆరోగ్యమిత్రలు పని చేస్తున్నారు.

కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయం..



నా కూతురు వెంకట లక్ష్మికి కొంత కాలంగా కిడ్నీ సమస్య ఏర్పడింది. దీంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాము. ఆపరేషన్ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద చేయాలని కోరాము. అయితే కిడ్నీ సమస్యకు ఆరోగ్యశ్రీ వర్తించదని అక్కడ చెప్పారు. దీంతో వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉండి చికిత్స చేయించుకున్ని రూ.40 వేలు ఖర్చు పెట్టాము.. ఆరోగ్య శ్రీ పథకం వర్తించదని వైద్యులు చెప్పడంతో వైద్యం కోసం డబ్బు ఖర్చు పెట్టలేక వెంకటలక్ష్మీని ఇంటికి తీసుకొచ్చేశాం. పేదలకు వర్తించని ప్రభుత్వ పథకాలు ఎందుకు..? పేదలకు ఆరోగ్య సమస్యలు వస్తే చావడం తప్ప మరోమార్గం కనబడడం లేదు.

- సుధాకర్, ఎల్లుట్ల, గుర్రంకొండ

5వ రోజు నామినేషన్ల పరంపర

- రాజంపేట ఎంపీ స్థానానికి మూడు నామినేషన్లు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 23: జిల్లాలో 5వ రోజు మంగళ వారం నామినేషన్ల పరంపర కొనసాగింది. రాజంపేట ఎంపీ స్థానానికి ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. రాయచోటి ఎమ్మెల్యే స్థానానికి వైసీపీ అభ్యర్థిగా గడికోట శ్రీకాం త్‌రెడ్డి తరఫున ఫయాజ్‌బాషా, వెంకటేశ్వర్లు రెండు సెట్లు నామినేషన్లు వేశారు. ఇదే స్థానానికి మన్సూర్ అలీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. రైల్వేకోడూరు వైసీపీ అభ్యర్థిగా కొరముట్ల శ్రీనివాసులు నామినేషన్ వేయగా.. కాకి లక్ష్మీ నరేశ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. ఇదే స్థానం నుంచి జనసేన తరఫున అరవ శ్రీధర్ ఒక సెట్టు నామినేషన్ వేశారు. రాజంపేట వైసీపీ తరఫున ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మూడవ సెట్టు నామినేషన్ దాఖలు చేయగా మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. మదనపల్లిలో జై భారత్ నేషనల్ పార్టీ తరఫున ఒకరు, మరో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. తంబళ్లపల్లిలో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు, రైల్వేకోడూరులో కాంగ్రెస్ పార్టీ తరఫున గోశాలదేవి, పీలేరులో ప్రజాదేశం తరఫున ఆశాది వెంకటాద్రి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున రాయచోటి నుంచి హరికృష్ణ నామినేషన్లు వేశారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 23: జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారిం ంచాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ అధికారులకు సూచించారు. మంగళవారం విజయవాడ, సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, వేసవిలో విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేశ్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 5450 హ్యాబి టేషన్స్ ఉన్నాయని, ప్రస్తుతం 80 హ్యాబిటేషన్లలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా మని, నీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలు, హ్యాబిటేషన్లు, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఎంపీడీవోలు, మున్సి ఎల్ కమిషనర్లు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలు క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా లోని తాగునీటి పథకాలను పరిశీలించి వీటి ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. ప్రజలు నీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 9032430230కి ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. వేసవి లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు నీరు, సేమియానా, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు.

రేపు సీఎం జగన్ పులివెందులకు రాక

- మధ్యాహ్నం నామినేషన్ దాఖలు

పులివెందుల, ఏప్రిల్ 23: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం పులివెందులకు రానున్నారు. ఉదయం 11 గంటలకు తాడేపల్లె నుంచి పులివెందులకు చేరుకుంటారు. సీఎస్ఐ చర్చి గ్రౌండ్ ఆవరణలో సభకు హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పులివెందుల అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం ఆయన బయలుదేరి తాడేపల్లెకు వెళ్లనున్నారు. ఇప్పటికే జగన్ తరఫున ఒక సెట్టు నామినేషన్‌ను ఆయన బాబాయి వైఎస్ మనోహర్‌రెడ్డి సోమవారం దాఖలు చేశారు.

వైభవంగా కోదండరాముని రథోత్సవం



- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





భారీ జనసందోహం మధ్య కోదండరాముని రథోత్సవం

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 23: ఏకశిలా నగిరి ఒంటిమిట్ట కోదండరాముని రథోత్సవం ఒంటిమిట్టలో కన్నులపండువగా సాగింది. మంగళవారం ఉదయం 10.15 గంటలకు ప్రారం భమైన రథత్సవం సాయంత్రం 5గంటల వరకు సాగింది. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని రథం లాగడానికి పోటీ పడ్డారు. రథోత్సవం సందర్భంగా శ్రీరామ నామస్మ రణతో ఆప్రాంతమంతా మార్మోగింది. రథంపై సీతారాముల ఉత్సవమూర్తులను చూసి భక్తులు పులకించిపోయారు. రథోత్సవం ఆద్యంతం భజంత్రీలు, చెక్కభజనలు మోగి స్తూ ముందు కుసాగారు. భక్తులు స్వామి వారికి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. అంతకుముందు రథోత్సవ కార్యక్ర మానికి సంప్రదాయ రీతిలో టీటీడీ వేదపం డితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజనీరింగ్ అధికారులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మదనపల్లె బెంగళూరు బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన జగన్ సిద్ధం హోర్డింగ్





మదనపల్లెలో మళ్లీ వెలసిన సిద్ధం హోర్డింగ్స్

- రోజుకు ఖర్చు రూ.3.28 లక్షలు
- వైసీపీ లెక్కలోకి వెళుతుందా..
- ఎమ్మెల్యే అభ్యర్థి ఖర్చులోకా..

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 23: రాష్ట్రంలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా, ఎంత ఖర్చు అయినా గెలవాలని వైసీపీ నాయకులు, అధిష్ఠానం ప్రచారం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అధ్యక్షుడు జగన్ బొమ్మతో వున్న సిద్ధం హోర్డింగ్స్ ఇళ్లపైన, దుకాణాల సముదాయాలపై భారీ సైజులో ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చాక ఎంసీసీ అధికారులు వీటిని తొలగించారు. దీంతో వైసీపీ అధిష్ఠానం ఎలాగైనా సిద్ధం హోర్డింగ్ పెట్టాలని ఖర్చుకు కూడా వెరవలేదు. దీంతో మదనపల్లె పట్టణంతో పాటు, మండలంలో ఇది వరకు పెట్టిన సిద్ధం హోర్డింగ్‌ల చోటే మళ్లీ సిద్ధం హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. దీనికి రాష్ట్ర సీఈవో నుంచి అనుమతి తీసుకున్నారు. అంతా బాగానే వుంది, కానీ మదనపల్లెలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన సిద్ధం హోర్డింగ్‌లకు ఎన్నికల ఖర్చు ఎంతో తెలిస్తే నోరు వెల్లబెట్టాల్సిందే. జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం ఇనుప ఫ్రేమ్‌తో కట్టిన హోర్డింగ్‌కు ఎన్నికల సంఘం చదరపు అడుగుకు ఒక రోజుకు రూ.65ధర కడుతోంది. దీని ప్రకారం మదనపల్లె మండలం, పట్టణంలో 12 చోట్ల సిద్ధం హోర్డింగ్స్‌కు అనుమతి తీసుకున్నా.. సీటీఎం, చిత్తూరు బస్టాండు వద్ద హోర్డింగ్‌లకు చలానా కట్టకపోవడంతో వాటిని ఆర్వో ఆదేశాలతో తొలగిం చారు. ఇవి పోగా మిగిలిన పది చోట్ల 5,050 చదరపు అడుగుల్లో సిద్ధం హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈనెల 18 నుంచి మే 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఈ హోర్డింగ్‌ల ప్రచారానికి అనుమతి తీసుకున్నారు. దీన్ని బట్టి చూస్తే ఒక రోజుకు 5,050 చదరపు అడుగుల సిద్ధం హోర్డింగ్‌కు రూ.3.28 లక్షలు వుండగా, 23 రోజులకు గాను రూ.75.49 లక్షలు ఖర్చు వస్తుంది. ఇక్కడ కేవలం జగన్ బొమ్మ మాత్రమే వుండటంతో ఈ హోర్డింగ్‌ల ఖర్చు వైసీపీ లెక్కలోకి పోతుందని కొందరు, కాదు మదనపల్లె వైసీపీ అభ్యర్థి ఎన్నికల ఖర్చులో వస్తుందని మరికొందరు అంటున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించి చేయరాదు. ఒకవేళ వైసీపీ అభ్యర్థి ఖర్చులోకే సిద్ధం హోర్డింగ్‌ల ఖర్చు వస్తే ఆయన అనర్హుడయ్యే అవకాశం వుంది.

ఇసుక అమ్మేశారు.. మట్టి తినేశారు..!

- ఐదేళ్లుగా అక్రమాలే
- అంతా వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే..
- సహజ వనరులను కొల్లగట్టారు



అక్రమంగా మట్టి తరలిస్తున్న దృశ్యం

సుండుపల్లె, ఏప్రిల్ 23: నిబంధనలు పట్టవు, అనుమతులు ఉండవు. ప్రజల బాధలు పట్టించుకోరు. భూగర్భ జలాల ప్రమాద ఘంటికలు చూడరు. అధికారులు ప్రశ్నించినా.. మాట వినకపోయినా వారికి బెదిరింపులతో పాటు బదిలీ వేటు తప్పదు ఇదీ ఇక్కడి వైసీపీ నాయకుల తీరు. వారి లక్ష్యం అక్రమార్జన.. అందినకాడికి దోచుకోవడం, సహజ వనరులను కొల్లగొట్టడం సుండుపల్లె మండలంలో ఐదు సంవత్సరాల నుంచి వైసీపీ నాయకులు విచ్చలవిడిగా చేస్తున్న దందా. ఎవరు పడితే వారు తవ్వడానికి వీల్లేదు. అధికార పార్టీ నేతల అండ ఉంటేనే తవ్వాలి. కనీస అర్హత అధికార పార్టీ వాళ్ల అని చెబితే చాలు ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి అమ్ముకోవచ్చు. బాహుదా నదికి గర్భశోకాన్ని మిగులుస్తున్నారు. సామంతుల తరహాలో ఎక్కడికక్కడ అధికార పార్టీ నాయకుల అనుచరులదే దందా జరుగుతోందని విమర్శలు జోరుగా ఉన్నాయి. మండలంలో సామాన్యులకు ఇసుక, మట్టి లభించాలంటే అక్రమ రవాణా చేస్తున్న వారికి అధిక సంఖ్యలో నగదు చెల్లించి తోలుకోవాల్సిందే. లేదంటే ఇసుక, మట్టి దొరకదు. ఇంటి నిర్మాణం ముందుకు సాగదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకను ఉచితంగా అందించడం లేదా అతి తక్కువ ధరకు ఇచ్చేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారిగా ధన దాహంతో అధికార పార్టీ నే త లం ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ప్రకృతి సంపదతో ఉన్న నదిని అక్రమార్కులు అమాంతంగా అమ్ముకున్నారు. రాయవరం, మడితాడు, సుండుపల్లె, తిమ్మసముద్రంతో పాటు మరి కొన్ని ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా జరిగింది. గత ఐదేళ్లలో అధికార పార్టీలోకి క్రియాశీలకంగా పనిచేసిన నాయకులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా కూడా పట్టించుకోకపోవడం, ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని ఊరువాడా తిరుగుతుంటే మండల ప్రజలు నవ్వుతున్నారని కొంత మంది వైసీపీ నాయకులే మాట్లాడుకుంటున్నారు.

ఇసుక, మట్టి రవాణాను కట్టడి చేశాం..

అధికారికంగా ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాము. ఎవరైనా అక్రమంగా ఇసుక లేదా మట్టి తరలించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. వారిని కఠినంగా శిక్షిస్తాము. బాహుదా నది వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశాము. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాము.

- జరీనా, తహసీల్దార్, సుండుపల్లె

గుట్టలను గుల్ల చేశారు...

సుండుపల్లె మండలంలో మట్టికి మంచి గిరాకీ ఉంది. మండల కేంద్రంలో ఇంటి స్థలాలకు డిమాండ్ పెరగడంతో ఇంటి నిర్మాణాలు అధికంగా జరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరందుకోవడంతో ఎక్కడ పడితే అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి అమ్మకాలు జోరుగా చేస్తున్నారు. ప్లాట్లు వేసేందుకు, ఇంటి నిర్మాణాల కోసం, ఇటుకల తయారీ కోసం బట్టి వ్యాపారులు ఇష్టారాజ్యంగా మట్టిని చెరువులు, కుంటలు, గుట్టల నుంచి తరలిస్తున్నారు. ముఖ్యంగా రెడ్లచెరువు, బోడిగుట్ట, అక్కంపల్లిగుట్ట, ఎల్లారెడ్డిగారిపల్లె గుట్టలు, బైరాన్‌చెరువు, ముట్టిమేకలగుట్ట, దుయ్యాలగుట్ట, కొత్తచెరువులో నుంచి మట్టిని ఇష్టారాజ్యంగా తరలించారని విమర్శలు ఉన్నాయి. ఇదంతా కొంతమంది అధికార పార్టీలో క్రియాశీలకంగా ఐదు సంవత్సరాలు పదవిని అనుభవించిన వ్యక్తులు ఈ దందాల వెనుక కీలకపాత్ర పోషించారనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు.

భూగర్భజలాలు అడుగంటిపోయాయి

బాహుదా, పించా నదుల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఇసుకను పరిమితికి మించి తరలించడం వలన తాగు, సాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ ఇసుక తరలింపు ఇందుకు కారణం అని స్థానిక రైతులు లబోదిబోమంటున్నా కూడా అధికారులు కానీ, అధికార పార్టీ నేతలు కానీ పట్టించుకోలేదు. బాహుదానదికి ఇరువైపులా వందలాది మంది రైతులు వారితో పాటు ఇతర పంటలను సాగు చేసి ఉన్నారు. ఆ పంటలు చేతికందాలంటే నీరు తప్పనిసరిగా ఉండాలి. ఇదంతా ఇసుక దందా నిర్వహించే వారికి పట్టదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కూడా ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉండడం ఆశ్చర్యంగా ఉంది. ఇప్పుడు కూడా అధికార పార్టీ నాయకులే ఇసుక తరలింపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

గుట్టలు మాయం చేశారు..



వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్జనే ధ్యేయంగా అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మండలంలో పేట్రేగిపోయారు. గుట్టలను చదును చేసి ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నారు. గుట్టలను కొల్లగొట్టి మట్టిని రియల్ ఎస్టేట్ దందాకు వినియోగించారు. ప్రకృతి సంపదను ఎక్కడికక్కడ అమ్ముకుంటూ లక్షలు సంపాదించుకున్నారు. ఈ ప్రభుత్వమంతా ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అండగా మారింది. మండల వ్యాప్తంగా సుమారు 40కిపైగా గుట్టలను కొల్లగొట్టి మట్టిని అమ్ముకున్నారు. చెరువుల్లో కూడా మట్టిని వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారు.

- కళ్లే రెడ్డెప్ప, టీడీపీ మండల అధ్యక్షుడు

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

కడప(మారుతీనగర్), ఏప్రిల్ 23: ఈ నెల 27న జరుగనున్న పాలీసెట్ -2024 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల జిల్లా సమన్వయకర్త సీహెచ్ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ మేరకు కడప నగరంలో 9 కేంద్రాలు, ప్రొద్దుటూరులో 7 కేంద్రాలతో కలిపి మొత్తంగా 16 కేంద్రాల్లో పరీక్ష జరుగనుందన్నారు. ఇందులో సుమారు 7,838 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. కాగా హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు హాజరు కావాల్సి వుంటుందన్నారు. హాల్ టిక్కెట్టుతో పాటుగా 2బి పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్, ఎరైజర్, షార్ప్‌నర్ మాత్రమే వారి వెంట తీసుకురావాల్సి వుంటుందన్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్, కాలిక్యులేటర్, తదితర ఇతర ఎలక్ట్రానిక్ సంబంధిత పరికరాలు అనుమతించబడదన్నారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, వడదెబ్బ తగలకుండా అవసరమైన మందులు, ఆయా శాఖల అధికారుల సహాయంతో బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారన్నారు. ఏదేమైనా ఉదయం 11 గంటల తర్వాత విద్యార్థులను లోనికి అనుమతించేది లేదన్నారు.

నత్తకే నడకలు..!




పులివెందుల ప్రాంతంలో పూర్తికాని వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు

- పూర్తికాని ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులు
- పార్నపల్లె నుంచి ఒక్కగ్రామానికి అందని వైనం
- పనులు సాగుతున్నాయ్.. అంతే..!
- నెల రోజుల్లో ముగియనున్న గడువు
- ఇదీ పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల తీరు

కడప, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అది సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా వాటర్ గ్రిడ్ పనులు ప్రారంభించారు. ఆ పనులు చూస్తే నత్తకే నడకలు నేర్పుతున్నట్లు సాగుతున్నాయి. మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాని దుస్థితి నెలకొంది. ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పనులు ఎన్నడు పూర్తవుతాయో అధికారులకే ప్రశ్నగా మిగిలింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...

పులివెందుల నియోజకవర్గంలో ఏడు మండలాల్లోని ప్రతి గ్రామానికి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజరాయర్ నుంచి రూ.480 కోట్లతో 299 గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి 299 గ్రామాలకు తాగునీరు అందించే వాటర్ గ్రిడ్‌లో 194 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు 175 పూర్తైనట్లు అధికారిక లెక్క. ఇప్పటి వరకు రూ.209 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. దాదాపు 200 కిలోమీటర్ల మేర వివిధ సైజుల్లో పైప్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందులో 50 శాతం మేర పనులు పూర్తైనట్లు సమాచారం. ఈ పనులను కేంద్ర ప్రభుత్వ నిధులతో జల్‌జీవన్ మిషన్ కింద పనులు చేపట్టారు. ప్రతి రోజు 65 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) శుద్ధినీటిని అందించాల్సి ఉంది. ఈ పనులు 21.5.2021వ తేదీన పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించే సమయంలో మూడేళ్లలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ 20.05.2024 నాటికి పూర్తికానుంది. అంటే ఒక నెలలో గడువు పూర్తికానుంది. అయితే పనులు మాత్రం పూర్తికాలేదు. మరో ఏడాదైనా పనులు పూర్తై గ్రామాలకు తాగునీరు అందుతుందని కనిపించ లేదు. వాటర్ గ్రిడ్ పనులు పైప్‌లైన్ ఏర్పాటు కోసం పనుల్లో పైపులు పొలాల గట్ల వద్ద ఉంచారు. వాటిని పూడ్చడంలో ఆలస్యమవుతోంది. కాగా పార్నపల్లె వద్ద శుద్ధినీటి కేంద్రం పనులు పూర్తయ్యాయి. మొదట లింగాల, సింహాద్రిపురం, పులివెందులకు నీటిని అందించాలని అనుకున్నప్పటికి ఆ పనులు అసంపూర్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ పనులను ఎంతో నాణ్యతగా 30 ఏళ్ల పాటు ఎలాంటి మరమ్మతులు లేకుండా సాగాల్సి ఉంది. కానీ పనులు మొదలుపెట్టి మూడేళ్ల గడుస్తున్నా పనులు పూర్తవకపోవడంపై ప్రభుత్వంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తయ్యే నాటికి ఏర్పాటు చేసిన పైపులు, ట్యాంకులు శిథిలమవుతాయేమోనని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే పనుల తీరు ఇలా ఉంటే మిగిలిన చోట్ల పనులు ఎలా సాగుతున్నాయో ఇట్టే అర్థమవుతోంది. ఏదేమైనా వాటర్ గ్రిడ్ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయన్నది నగ్నసత్యం.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలి
- ఆకస్మిక తనిఖీల్లో వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్


సిబ్బందితో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. మంగళవారం వైవీయూలో పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్, సీఎల్ స్టాకు రిజిస్టరు పరిశీలించారు. వాటిని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉద్యోగులందరూ కార్యాలయంలో సమయపాలన పాటించాలని పనివేళల్లో సీట్లో కనిపించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యాలయానికి సక్రమంగా రాని ఉద్యోగులకు జీతాలు నిలుపుతామని హెచ్చరించారు. అలాగే స్వీకరించిన అన్ని ఫైళ్లను అదే రోజు ప్రాసెస్ చేసి క్లియర్ చేసేలా చూడాలన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

19న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 23: పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరచిన పద్మశాలీయ విద్యార్థులకు మే 19వ తేదీన ప్రతిభ పురస్కారాలను అందజేస్తామని పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు తెలిపారు. మంగళవారం పద్మశాలీయ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో చదువుకుని ఇంటర్మీడియట్‌లో అన్ని గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రూపులవారీగా ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు అందజేస్తామన్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, ప్రభుత్వ పాఠశాలలో చదివి 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులను అందజేస్తామన్నారు. ఎంసెట్, నీట్, ఇంజనీరింగ్, ఐఐటీ, జేఈఈలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులను బహూకరిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు మే 10వ తేదీలోపు తమ దరఖాస్తులను పద్మశాలీయ కల్యాణ మండపంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9440074989లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిండెంట్ చెన్నా చంద్రబాబు, ఉపాధ్యక్షులు నందం లక్ష్మణకుమార్, జలదుర్గం మునిస్వామి, కార్యదర్శి ఆనంద్, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాండేజీలతో వినూత్న ప్రచారం


బ్యాండేజీలతో ప్రచారం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో వైష్ణవి

పీలేరు, ఏప్రిల్ 23: కళ్లు, నుదిటిపై బ్యాండేజీలతో ముఖ్యమంత్రి జగన్, మాజీ మంత్రి వెలంపల్లె శ్రీనివాస్‌లను అనుకరిస్తూ పీలేరులోని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మంగళవారం వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ముబారక్, అబ్దుల్లా, హరీష్, సురేశ్, రెడ్డిముని, నాయుడు, మల్లి తమ కళ్లు, నుదుటిపై బ్యాండేజీలు కట్టుకుని స్థానిక సైనిక్‌నగర్, కావలిపల్లె ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సానుభూతి కోసం జగన్, ఆయన నాయకులు గులకరాయి డ్రామా ఆడుతున్నారని, వాటిని నమ్మకుండా ఎన్నికల్లో కూటమి అభ్యర్థులైన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కుమార్తె వైష్ణవిరెడ్డి కాసేపు వారితో కలిసి ప్రచారం నిర్వహించారు.

ఎడ్‌సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చైర్మన్ ప్రొఫెసరు ఆంజనేయప్రసాద్, కన్వీనరు సురేంద్రనాథరెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ ద్వారా 2024-25 విద్యాసంవత్సరంలో యానిమేషన్ అప్లైడ్‌ఆర్ట్స్, పెయింటింగ్, కల్చర్ ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్‌లో ప్రవేశం కోరే విద్యార్థులు హయ్యర్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 22 వరకు గడువు ఉందన్నారు. వివరాలకు ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్, యూనివర్శిటీ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

బీజేపీ నాయకులపై కేసు నమోదు

ముద్దనూరు ఏప్రిల్ 23: మండల పరిధి బొందలకుంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులపై మంగళవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. గత ఆదివారం బొందలకుంట గ్రామానికి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి రాగా ముట్టే రామచంద్రుడు, గాలం సుబ్బయ్య, చల్లా ఖాదరయ్య టపాసులు పేల్చి ఎన్నికల నియమావళి ఉల్లించారని, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్-3 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేజీబీవీ విద్యార్థిని రూష్మికకు 583 మార్కులు


రూష్మిక

సింహాద్రిపురం, ఏప్రిల్ 23: మండలంలోని నిడివెలగల వద్దగల కేజీబీవీ పాఠశాల విద్యార్థి సి.రూష్మిక పదవ తరగతి ఫలితాల్లో 583 మార్కులు సాధించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లోని కేజీబీవీల్లో ఇవే అత్యధిక మార్కులని కేజీబీవీ ప్రిన్సిపాల్ గురుదేవి తెలిపారు. అలాగే పాఠశాల్లో 550 పైగా మార్కులు సాధించిన వారు 8 మంది, 500పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు 18 మంది, 450కి పైగా మార్కులు పైగా సాధించిన వారు 7 మందితో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

- 23 నుంచి ఫీజు చెల్లింపు
- 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 23: ఏపీ డీఈఈ సెట్ 2024కు సంబంధించి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసిందని, డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండేళ్ల ఉపాధ్యాయ కోర్సులో చేరడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 23వ తేదీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి 24 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆమె వెల్లడించారు. డీఈఈ రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కంప్యూటర్ బేస్డ్) ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని వివరించారు. 2024 సెప్టెంబరు 1వ తేదీ నాటికి అభ్యర్థులకు 17 ఏళ్లు నిండి ఉండాలన్నారు. దీనికి గరిష్ఠ వయోపరిమితి ఉండదని తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.750లు చెల్లించాలన్నారు. మే నెల 8వ తేదీ ఫీజు చెల్లింపునకు, 9న దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగుస్తుందన్నారు. మే 21వ తేదీ ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు తమ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. మే 24వ తేదీ పరీక్ష, మే 30 తేదీ ఫలితాలు వెల్లడి అవుతాయన్నారు. అలాగే జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు అభ్యర్థులు కళాశాలలు ఎంచుకోవడానికి వెబ్ ఆప్షన్ పెట్టుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీ అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ప్రభుత్వం డీఎడ్ కళాశాలలను కేటాయిస్తుందని, జూన్ 12 నుంచి 15 వరకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందన్నారు. జూన్ 20వ తేదీ కళాశాలల్లో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందని ఆమె ప్రకటనలో తెలిపారు.

వేడుకగా ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం


గంగా, రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 23: రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు స్వామివారి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. సైకతలింగానికి, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి చండీమాత, శ్రీచక్రంకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతి హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగరాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ఘనంగా గంధం మహోత్సవం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 23: పట్టణంలో వెలసిన దర్గా ఏ-గఫారియా జహిరాయ దర్గా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఉరుసు మహోత్సవంలో భాగంగా రెండో రోజు గంధం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పడమటవీధి నుంచి మేళతాళాలతో, చిన్నారుల కేరింతలతో, ఫక్కీరు విన్యాసాలతో బాణసంచా పేల్చుతూ తీసుకువచ్చారు. ఊరేగింపులో ఫక్కీర్లు చేసే విన్యాసాలు చూపరులకు ఒళ్లు గగుర్పొడిచినట్లయింది. ప్రస్తుత పీఠాధిపతి ముతవల్లి గఫార్‌షా ఖాద్రి ఆయన సోదరులు గంధం మహోత్సవంలో పాల్గొన్నారు.

అలరించనున్న ఖవ్వాలి: గంధం ఉరుసు మహోత్సవ సందర్భంగా రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించనున్నారు. ఈ ఏడాది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రాజస్థాన్‌కు చెందిన సలీంసాబిరి, ముంబైకి చెందిన ఖలీమ్ నయీం హస్మిల మధ్య కబాలీ పోటీ జరగనుంది.

24న బండలాగుడు పోటీలు: ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దర్గా ఆవరణంలో పాల దంతాలు గల వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు రూ.50 వేల నుంచి బహుమతులు అందించనున్నారు.


ఉరుసు ఉత్సవంలో విద్యుత్ కాంతులు

ఎన్నికల ప్రచారంలో వెటర్నరీ అసిస్టెంట్, రేషన్ డీలర్లు


ప్రచారంలో పాల్గొన్న సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్, రేషన్‌డీలర్

వీరబల్లి, ఏప్రిల్ 23: వైసీపీ రాజంపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మిథున్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాధరెడ్డిల ఎన్నికల ప్రచారంలో వెటర్నరీ అసిస్టెంట్, రేషన్ డీలరు పాల్గొన్నారు. మంగళ వారం మండల కేంద్రంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో వంగి మళ్ల గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, పెద్దమాదిగపల్లె రేషన్‌షాపు డీలర్ మలికార్జునలు పాల్గొని వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సన్మానించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు.

వైసీపీ కార్యకర్తపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 23: వైసీపీకి చెందిన వెంకటరామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సోమవారం నామినేషన్ వేశారు. ఈ నేపథ్యంలో స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలకు చెందిన చౌడమ్మ ఆలయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ బాణసంచా కాల్చారు. ఈ ఘటనపై ఫ్లయింగ్ స్క్వాడ్-1 అధికారి శ్రీనివాసులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వెంకటరామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కన్నులపండువగా సీతారాముల కల్యాణం


కల్యాణోత్సవం జరిపిస్తున్న వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు

పీలేరు, ఏప్రిల్ 23: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పీలేరు మండలం కాకులారంపల్లె ఇందిరమ్మ కాలనీలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దళవాయి సురేశ్‌కుమార్‌రెడ్డి అలియాస్ కంచి సూరి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లను కాలనీ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కాలనీ ప్రజలు, భక్తులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేంద్ర, నివాస్‌రెడ్డి, కిరణ్, భరద్వాజ్, చెన్నారెడ్డికాలనీ హరి, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్, సూరి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా పట్టాభిరాముల రథోత్సవం


కందుకూరు పురవీధుల్లో ఊరేగుతున్న పట్టాభిరాముల వారు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 23: మండలంలోని కందుకూరులో వెలసిన పట్టాభిరాముల శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం పట్టాభిరాముల వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. శ్రీ సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల ఉత్సవ విగ్రహాలను రథంలో అదిష్టించి పురవీధుల్లో విహరించారు. స్వామివారి రథం ముందు భజన బృందాలు, చెక్కభజనలతోటి, కోలాటాలు చేస్తుండగా పురవీధుల్లో మంగళవాయిద్యాలతో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నిరాజనాలు అందించారు. కందుకూరు గ్రామం భక్తులతో కిటకిటలాడింది. పట్టాభిరాముల రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని తిలకించారు.

నూతన కమిటీ నియామకం


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 23: మండల కేంద్రమైన పీటీ ఎంలో వెలసిన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నూతన కమిటీని మంగళ వారం ఆర్యవైశ్యులు ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా పీటీఎంకు చెందిన దొంతి రాజశేఖర్‌ను, కార్యదర్శిగా నాగరాజు, గడ్డం సతీష్‌ను ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం అభివృద్ధికి, సంఘం పటిష్టం కొరకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గత కమిటీలో ఉన్న అభ్యర్థుల నుంచి దేవస్థానానికి చెందిన రికార్డులను నూతన కమిటీకి అప్పగించారు. వచ్చే నెల మే 18న కన్యకా పరమేశ్వరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నూతన కమిటీ ఆమోదించినట్లు పేర్కొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన ?

మైదుకూరు, ఏప్రిల్ 23: పట్టణంలోని కంప్యూటర్ నేర్చుకునేందుకు వచ్చిన బాలిక పట్ల ఆ సెంటరు నిర్వాహకుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బాలికకు కంప్యూటర్ నేర్పించే క్రమంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు మంగళవారం నిర్వాహకునిపై పోలీసులకు సమాచారం అందించారు. నిర్వాహకుని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.





తన అన్నను గెలిపించుకోవడానికి అవ్వను ఓటు అడుగుతున్న సుగవాసి ప్రసాద్ బాబు

రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ తరఫున సుగవాసి బాలసుబ్రమణ్యం రంగంలోకి దిగడంతో ఇక్కడ సమీకరణలు మారిపోయాయి. బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు సుగవాసి గెలుపుకోసం ప్రచారం సాగిస్తున్నారు. రాజంపేటలో సుగవాసి సామాజిక వర్గీయులు ఎక్కువ... వీరితో పాటు ఇతర సామాజిక వర్గాలూ ఏకతాటిపైకి వచ్చారు. వైసీపీలో కీలక కార్యవర్గమంతా ఇటీవల టీడీపీలో చేరారు. ఇప్పటికే ముస్లింలూ వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీంతో వీరంతా కలిసికట్టుగా సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక అన్నదమ్ములు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబు రామలక్ష్మణుల్లా ప్రచారం చేస్తూ.. రాజంపేటలో టీడీపీ జెండా ఎగురవేడయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



సుగవాసి కోసం.. కలిసికట్టుగా..!

- రాజంపేటలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా..
- ప్రచారంలో సుడిగాలిలా దూసుకుపోతున్న కూటమి నేతలు
- గెలుపులో కీలక పాత్ర పోషించనున్న జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి
- ప్రధాన సామాజిక వర్గాలన్నీ సుగవాసి వైపు ప్రచారం
- వైసీపీని పూర్తి స్థాయిలో దెబ్బకొట్టనున్న జిల్లా సెంటిమెంటు, అన్నమయ్య ప్రాజెక్టు, మెడికల్ కళాశాల
- సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపునకు కలిసి వచ్చే అంశాలు ఎన్నెన్నో..



నందలూరులో ఊరూవాడా సుగవాసి వైపు కదులుతున్న జనంతో ఎద్దల సుబ్బరాయుడు, శ్రీనివాసరాజు



రాజంపేట, ఏప్రిల్23: రాజంపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధానంగా తన తమ్ముడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నకు తోడుగా ఉంటూ రామలక్ష్మణుల వలె ఇరువురు ఆరు మండలాల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ప్రతి రోజూ ఇరువురు రెండు మండలాల చొప్పున ప్రచారం చేస్తున్నారు. ప్రధాన నేతలను కలవడం, అన్ని వర్గాల నేతలతో మాట్లాడటం, ఆయా సామాజిక వర్గాల నేతలను తమ వైపు తిప్పుకోవడంలో విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ నాయకులను, క్యాడర్‌ను తమ వైపు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యారు. మొత్తం టీడీపీ క్యాడర్ అంతా సుగవాసి బాలసుబ్రమణ్యం వైపే నడుస్తోంది. తెలుగుదేశం పార్టీ క్యాడర్‌తో పాటు బీజేపీ, జనసేన కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటించి ప్రచారంలో నిమగ్నమైంది. మూడు పార్టీల నాయకులు ఇప్పటికే అన్ని మండలాల్లో ప్రచారాలు చేస్తున్నారు.

- టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేశ్‌నాయుడు, జనసేన ప్రధాననాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ, అతికారి దినేశ్, మలిశెట్టి వెంకటరమణ లాంటి ప్రధాన నాయకులు ఉమ్మడి అభ్యర్థి అయిన సుగవాసి బాలసుబ్రమణ్యం తరఫున రాత్రింబవళ్లు ప్రచారాలు నిర్వహిస్తున్నారు.
- బీజేపీ తరఫున ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల సుగవాసి బాలసుబ్రమణ్యంతో చేతులు కలిపి ప్రధాన నాయకులను కలిసి ఉమ్మడి నేతలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి ఇరువురు అభ్యర్థులు ముందుకు దూసుకుపోతున్నారు. మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, బీసీ నాయకుడు డాక్టర్ చెన్నూరు సుధాకర్‌తో పాటు ఆరు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాలసుబ్రమణ్యంకు మద్దతు పలికి ప్రచారంలో ముందున్నారు.
- నియోజకవర్గంలో రెడ్ల సామాజిక వర్గంలోని నియోజకవర్గ నాయకులు పోలి సుబ్బారెడ్డి, మాజీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు సాగా సుధాకర్‌రెడ్డి, సుండుపల్లిలో శివారెడ్డితో పాటు ఆరు మండలాల్లోని రెడ్ల సామాజిక వర్గంలోని అధిక మంది ఇటీవల లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకొని వైసీపీకి పెద్ద షాక్ ఇచ్చి ఇటు సుగవాసికి, అటు ఎంపీ అభ్యర్థి నల్లారి విజయానికి నడుం బిగించారు. వీరంతా సిట్టింగ్ ఎమ్మెల్యే వైసీపీ నేత మేడా మల్లికార్జునరెడ్డి వర్గం కావడం విశేషం. వీరి చేరికతో ఒక్కసారిగా సుగవాసి స్పీడ్ సుడిగాలిలా ముందుకు సాగుతోంది.
- ప్రధాన క్షత్రియ సంఘం నేతల్లో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, చమర్తి జగన్‌మోహన్‌రాజు, శ్రీనివాసరాజు తదితర ఆ సామాజిక వర్గ నేతలు ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. ఇక తెలుగుదేశం పార్టీలోని కమ్మ సామాజిక వర్గమంతా సుగవాసి వెంట నడుస్తోంది. సీనియర్ టీడీపీ నాయకులు కొండయ్య నాయుడు, బాపనయ్యనాయుడు, వెంకటేశ్వర్లనాయుడు, గుడారు సుబ్రమణ్యంనాయుడు, కావుటూరి సుబ్రమణ్యంనాయుడు, కూచివారిపల్లెకు చెందిన వెంకటయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి అజయ్‌లాంటి ప్రధాన నాయకులు సుమారు డజను మందికి పైబడి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రచారం పూర్తి చేశారు.
- ముస్లిం మైనారిటీ నేతల్లో రాజంపేటకు చెందిన అబుబకర్, గుల్జార్‌బాషా తదితర ముస్లిం మైనారిటీ నేతలు సుగవాసికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీలకు సంబంధించిన డాక్టర్ చెన్నూరు సుధాకర్, మనుబోలు వెంకటసుబ్బయ్య, నందలూరు మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, కొమరా వెంకటనరసయ్య, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రమణలతో పాటు సుండుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప తదితరులు సుగవాసి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఇక సుగవాసి బాలసుబ్రమణ్యం స్వంత సామాజిక వర్గమైన బలిజలంతా సుగవాసి వెంటే ఉన్నారు.
- రాజంపేట అబ్జర్వర్, దుర్గా ట్రాక్టర్స్ అధినేత దుర్గా ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారులు పసుపులేటి ప్రదీప్, పసుపులేటి పవన్‌కుమార్, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, ఆయన కుమారుడు మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఎద్దల విజయసాగర్, కడవకూటి సాయిబాబా, మాజీ మండలాధ్యక్షుడు పల్లె సుబ్రమణ్యం, ఒంటిమిట్ట నాయకులు బొబ్బిలి రాయుడు, సిద్దవటం సీనియర్ నాయకులు అతికారి వెంకటయ్య కుమారుడు జనసేన నేత అతికారి దినేష్, అతికారి కృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ, రాజంపేట పట్టణ సీనియర్ న్యాయవాది సింగంశెట్టి రవీంద్ర తదితర ఆరు మండలాల బలిజ సంఘ నాయకులు సుగవాసి వెంట నడుస్తున్నారు. ఈ విధంగా నియోజకవర్గంలోని రాజంపేట పట్టణం, రాజంపేట రూరల్, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో ప్రధాన నాయకులంతా సుగవాసి బాలసుబ్రమణ్యం వైపు వచ్చి టీడీపీ, అటు బీజేపీ భారీ విజయం చేకూర్చడానికి ఎవరి వంతు వారు ప్రయత్నాలు చేశారు.

ఆరు మండలాల్లో మా వర్గమంతా ఆయన విజయానికి కృషి..



రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని మా వర్గీయులంతా ఇటు టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం అహర్నిశలు పాటుపడుతున్నారు. గతంలో వైసీపీలో ఉన్న ప్రధాన నాయకులంతా మా వైపు వచ్చి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో వందలాది మంది టీడీపీ తీర్థం పుచ్చుకొని పార్టీ అభ్యర్థుల గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. నియోజకవర్గంలో ఇరువురు కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీ రావడం తథ్యం.

- పోలి సుబ్బారెడ్డి, నియోజకవర్గ టీడీపీ నాయకులు

భారీ మెజారిటీతో గెలుపొందడం తథ్యం



రాజంపేటలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం భారీ మెజారిటీతో గెలుపొందడం తథ్యం. ఈ మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అంతా నడుం బిగించింది. మాజీ మంత్రి దివంగత సోషలిస్టు నేత బండారు రత్నసభాపతి రాజకీయాలను పుణికి పుచ్చుకున్న తామంతా సుగవాసి బాలసుబ్రమణ్యం, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిల గెలుపునకు కృషి చేస్తున్నాం. వైసీపీ నేతల ఆగడాలకు చెక్‌పెట్టి కూటమి నేతలను గెలిపించుకొని డబుల్ ఇంజన్ సర్కారుతో ముందుకు సాగడానికి అందరూ సిద్ధం కండి.

- ఎద్దల సుబ్బరాయుడు, ఆర్టీసీ మాజీ చైర్మన్

భారీ మెజారిటీతో గెలుపు ఖాయం..



టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలు భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయం. వైసీపీ దురాగతాలకు చెక్‌పెట్టే రోజులు దగ్గరపడ్డాయి. ఈ ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో కూటమి గాలి బలంగా వీస్తోంది. ఆరు మండలాల్లో తెలుగుదేశం పార్టీ అటు జనసేన, బీజేపీలు సంయుక్తంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను మా వైపు తిప్పుకున్నారు. వీరి గెలుపు నల్లేరుపై నడకే..

- చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు

గెలుపులో బీజేపీ కీలక పాత్ర..



రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగ వాసి బాలసుబ్రమణ్యంతో పాటు బీజేపీ ఎంపీ అభ్యర్థి, నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపులో జనసేన, టీడీపీతో పాటు బీజేపీ కీలక పాత్ర పోషించనున్నాయి. ఇప్పటికే పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో బీజేపీ క్యాడర్ అంతా ఉమ్మడి అభ్యర్థుల విజయం కోసం కీలక పాత్ర పోషిస్తున్నాం. రాజంపేటలో సుగవాసి బాలసుబ్రమణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ తరఫున పోటీ చేయడం శుభపరిణామం.. ఆయనతో పాటు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించడం ఖాయం.. ఇప్పటికే ఈ అంశం తేలిపోయింది.

- సాయిలోకేశ్, బీజేపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు

జనసేన కీలక పాత్ర పోషిస్తోంది..



మా అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజంపేటలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం జనసేన సైన్యమంతా ముందుకు సాగుతోంది. జనసేన పార్టీ వీర మహిళలు, మా పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు రెండు నెలలుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నేను ఎన్నికల పార్లమెంటు జనసేన ప్రతినిధిగా ఉంటూ రాజంపేట అభ్యర్థుల గెలుపుకోసం నా వంతు కృషి చేస్తున్నా. రోజూవారి ప్రచారాల్లోనూ, సమావేశాల్లోనూ పాల్గొంటున్నా.

- యల్లటూరు శ్రీనివాసరాజు, జనసేన పార్టీ పార్లమెంటు నాయకులు

రాజంపేట అభివృద్ధిలో మా కుటుంబానిది కీలక పాత్ర



గతంలో తాము వైసీపీలో చేరి తప్పు చేశాను.. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోవడం అన్యాయం దుర్మార్గం.. ఈ ప్రాంతవాసుల మనోభావాలకు, భావితరాలకు మాయని మచ్చ.. దీనిని ఎవ్వరూ హర్షించరు.. అన్నమయ్య ప్రాజెక్టు తెంచి బాధితులకు ఒక్కరికి కూడా న్యాయం చేయలేదు. మెడికల్ కళాశాలను రాకుండా చేశారు.. ఒక్క అభివృద్ధి పని జరగలేదు. అందువల్ల తాను వెనువెంటనే ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరాను. ఇక్కడ సుగవాసి బాలసుబ్రమణ్యం 50వేల మెజారిటీతోనూ, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి 3లక్షల మెజారిటీతోనూ గెలుపొందడంతథ్యం తథ్యం.. దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరు..

- కొండూరు శరత్‌కుమార్‌రాజు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు



అందరితో కలుపుగోలుగా ముందుకుసాగుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో ఐక్యతారాగాన్ని ఆలపిస్తున్న సుగవాసి, సీఆర్‌సీ, చమర్తి తదితరులు



సుండుపల్లిలో టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం సోదరుడు సుగవాసి ప్రసాద్‌ను ఆత్మీయంగా స్వాగతిస్తున్న ప్రజలు



టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు సాయిలోకేశ్, నాగోతు రమేశ్‌నాయుడు తదితరులు

సుగవాసికి కలిసొచ్చే అంశాలు..

- రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపులో కీలక పాత్ర పోషించేది జిల్లా అంశం.. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోగా ఇక్కడికి వచ్చిన మెడికల్ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించారు.
- దేశంలోని అత్యంత తీవ్ర దుర్ఘటన అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం.. వైసీపీ నేతల ఇసుక దాహానికే అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిందన్నది ఈ ప్రాంతీయుల బలమైన వాదన.. ఇసుక లారీలు మునిగిపోతాయని భారీ వర్షపు నీటిని కిందికి వదలకుండా ఆపడం... ఎగువనున్న పింఛాప్రాజెక్టు తెగి నీరంతా రావడంతో.. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి 40 మంది వరకు చనిపోవడం, ఇంతవరకు ముంపు బాధితులకు ఇళ్లు కట్టించకపోవడం, రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో ఆ ప్రాంతీయులు వైసీపీపై గుర్రుగా ఉన్నారు.
- ఎంటెక్ పూర్తి చేసి ఉన్నత విద్యావంతుడు కావడం.. తమ తండ్రి నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉండటం, ప్రధానంగా నిగర్వి, సాధారణ వ్యక్తిత్వం కలిగి ఉండటం, పేదలకు అందుబాటులో ఉండటం తక్కువ మాట్లాడి.. ఎక్కువ పనిచేయడం. అన్నింటికీ మించి అబద్ధాలు మాట్లాడకపోవడం.. సాధ్యమైనంత వరకు సాధారణ జీవితానికి అనుగుణంగా ఉండటం. సౌమ్యునిగా మెలగడం సుగవాసి బాలసుబ్రమణ్యంకు గెలుపునకు బాగా పనికివచ్చే అంశం.
- రాజంపేట నియోజకవర్గంలో సుండుపల్లి, వీరబల్లి మండలాలు సుగవాసి బాలసుబ్రమణ్యం కుటుంబానికి ఆది నుంచి పెట్టని కోటలు. వారి తండ్రి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నారు. మొదట్లో సుండుపల్లి మండలం రాయచోటి నియోజకవర్గంలో ఉండేది. సుండుపల్లి మండలంలో సుమారు 40వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయి. అదే విధంగా వీరబల్లి మండలంలో వీరికి భారీ అనుచరగణం ఉంది.. అందువల్ల ఈ మండలాల్లో ఎక్కువ శాతం సుగవాసి బాలసుబ్రమణ్యం వైపు మొగ్గుచూపుతున్నారు. అందువల్ల సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు సునాయాసం కానుంది.
- జిల్లా కేంద్రం సెంటిమెంటు బలంగా ఉంది. రాజంపేట, నందలూరు మండలాలు.. రాజంపేట పట్టణంతో పాటు రూరల్ మండలంలో 90వేల ఓట్లు ఉన్నాయి. ఆది నుంచి ఈ మండలం తెలుగుదేశం పార్టీకి పెట్టని కోట.. అదే విధంగా రాజంపేట పట్టణం గత ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో కూడా టీడీపీ పోటాపోటీగా ఓట్లు తెచ్చుకుంది. ఇప్పుడు రాజంపేట పట్టణం టీడీపీ వైపు వన్‌సైడ్‌గా ఉంది. ఇకపోతే నందలూరు జిల్లా సెంటిమెంటుతో పాటు ఇక్కడ లోకోషెడ్డు, ఆల్విన్ పరిశ్రమల స్థానంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఇక్కడ ఏ అభివృద్ధి జరగలేదు. ఇక్కడ సుగవాసి బాలసుబ్రమణ్యంకు సంబంధించిన బలిజ సామాజిక వర్గం ఎక్కువగా ఉంది. వారితో పాటు బీసీలు ఇక్కడ ఎక్కువ.. వీరంతా సుగవాసి వైపు నడుస్తున్నారు. పై కారణాలతో పాటు జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపునకు బాగా ఉపకరించనుంది.

ముస్లింలకు ద్రోహం చేసిన జగన్‌ను ఓడించి తీరుతాం..



రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలకు జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారు. ఐదేళ్ల పరిపాలనలో ముస్లింలకు ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కానీ, సంక్షేమ కార్యక్రమాలు కానీ విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకాలు కానీ ఇవ్వలేదు. నాకు రాష్ట్ర రోడ్డురవాణా కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎందుకూ కొరగాని పదవి ఇచ్చారు తప్ప ఆ కార్పొరేషన్ తరపున ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. రాజంపేటలో ఒక్క తట్ట సిమెంటు పని చేయలేకపోయాను. ఒక గల్లీ రోడ్డు కూడా వేయలేకపోయాను. ఎందుకూ కొరగాని ఆ పదవికి రాజీనామా చేశా. ముస్లింల కోసం ముందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం. జగన్‌ను ఓడించి తీరుతాం.

- గుల్జార్‌బాషా, రాజంపేట సీనియర్ ముస్లిం మైనారిటీ నాయకుడు

వైసీపీ నేతలను చిత్తుచిత్తుగా ఓడిస్తాం..



రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా, ఇంజనీరింగ్ కళాశాల రాకుండా.. అన్నమయ్య ప్రాజెక్టు తెంచిన వైసీపీ నాయకులను చిత్తుచిత్తుగా ఓడించి తీరుతాం. ఇటు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, అటు ప్రధాని నరేంద్రమోదీ ప్రభంజనంలో వైసీపీ రాష్ట్రంలో కొట్టుకుపోవడం ఖాయం.. ప్రధానంగా రాజంపేటకు అన్ని రంగాల్లో అన్యాయం చేసి ఈ ప్రాంతాన్ని ఎందుకూ పనికిరాకుండా చేసిన వైసీపీ నాయకులను ఓడించడానికి బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ముందుకు కదులుతోంది. మహిళలను చైతన్యపరిచి ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నాం.. రాజంపేట టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం, పార్లమెంటు అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిలు భారీ మెజారిటీతో గెలుపొందడం తథ్యం.

- పత్తిపాటి కుసుమకుమారి, మాజీ టీడీపీ మహిళాధ్యక్షురాలు

25న రాజంపేటకు చంద్రబాబు పవన్‌కల్యాణ్ రాక



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న జనసేన పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 23 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 25న రాజంపేటకు రానున్నారు. సాయంత్రం 4గంటలకు రాజంపేట పాతబస్టాండులో బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి రాజంపేటలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నారు. జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు తమ నాయకులతో కలిసి మంగళవారం పనులను పర్యవేక్షించారు.

ద్విచక్రవాహనం వేలం

సంబేపల్లె, ఏప్రిల్ 23: ఎజ్ చేసిన మోటారు సైకిల్‌ను 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎస్‌డీపీవో, రాయచోటి సమక్షంలో సంబేపల్లె పోలీస్‌స్టేషన్లలో వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ వీ. రామకృష్ణ మంగళవారం తెలిపారు. వేలం పాట రూ. 25 వేల నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

టీడీపీ బ్రాహ్మణ విభాగం కన్వీనర్‌గా ఆదినారాయణ



ఒంటిమిట్ట, ఏప్రిల్ 23 : రాజంపేట టీడీపీ పార్లమెంటు బ్రాహ్మణ విభాగం కన్వీనర్‌గా ఒంటిమిట్టకు చెందిన గద్దె ఆదినారాయణను టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో తనను గుర్తించి పార్టీ పదవి అప్పగించడం ఆనందమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాతమ్మ ఆలయంలో అభిషేకం, పూజలు

సుండుపల్లె, ఏప్రిల్ 23: మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ కొలిమిట్ట సమీపంలోని మాతమ్మ ఆలయంలో మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు దర్శనమిస్తాయి.

పేదల సంక్షేమాన్ని విస్మరించారు

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

సుండుపల్లె, ఏప్రిల్ 23: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని విస్మరించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీలో కూటమి ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు ఈ ఐదేళ్లలో గ్రామ పంచాయతీల్లో ఏ ఒక్క అభివృద్ధి పనికి శిలాఫలకం వెయ్యలేదని ఓటర్లకు తెలియజేశారు. మంచి చేసి ఉంటే ఓటు వేయమని వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సిగ్గులేకుండా మరోమారు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా తిమ్మసముద్రం గ్రామ పంచాయతీలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, ప్రధన కార్యదర్శి ప్రసాద్‌రాజు, చప్పిడి రమేశ్‌నాయుడు, రామనాధరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబునాయుడు, దామోదర్‌నాయుడు, వెంకటేశ్వర్‌నాయుడు, సత్యంనాయుడు, జయరాంనాయుడు, సుబ్బారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసులునాయుడు, శివరాంనాయుడు, మండల మాజీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, జనసేన మండల నేత రెడ్డిరాణి, రామాశ్రీనివాసులు, బీజేపీ జిల్లా నాయకులు వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మసముద్రంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సుగవాసికి మూడు గ్రామాల ప్రజల మద్దతు

నందలూరు: మండలంలోని కోనాపురం, చింతకాయలపల్లె, కొమ్మూరు గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్ద సంఖ్యలో బీజేపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జోరుగా టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన వారితో అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

న్యాయవాదికి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మండిపల్లి సతీమణి హరితమ్మ



ఓబులవారిపల్లె, ఏప్రిల్ 23 : మండలంలోని బొమ్మవరం గ్రామ పంచాయతీలో ఉమ్మడి అభ్యర్థి అరవ శ్రీధర్, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపుకోసం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ప్రచారం చేశారు. బొమ్మవరంలో టీడీపీఈ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, ఆయన సతీమణి వరలక్ష్మి, ఆధ్వర్యంలో పెంచలయ్య, శివయ్య, వైసీపీ వైస్ సర్పంచ్ రామాంజినేయులు, సుబ్బనరసయ్య, విజయ్ టీడీపీ కండువా కప్పుకున్నారు. బొమ్మవరం గ్రామానికి చెందిన బొమ్మవరం రామచంద్రా రెడ్డి, రాజారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, సానయగారి సునీల్ కుమార్‌రెడ్డి, కొమ్మూరి నారాయణరెడ్డి, చక్రవర్తుల శివరాజు, అనంతరాజు వైసీపీని విడిచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు గడ్డం చంగల్‌రాజు, మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి టీడీపీ, కేంద్రంలో బీజేపీ మళ్లీ విజయం తథ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో , మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాధనాయుడు, ఉమ్మలరాజు పిచ్చిరాజు, ఉమ్మలరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచ్ శకునాల నరసింహరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్‌రాజు, చంగల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి వితన్‌నిస్సార్, డాక్టర్ సుగవాసి విద్యాధర్‌ల ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి మండిపల్లి హరితరెడ్డి సమక్షంలో మాసాపేటకు చెందిన వైసీపీ నేత, ప్రముఖ న్యాయవాది వీ. అజ్మతుల్లా మంగళవారం టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా అజ్మతుల్లా మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పథకాలు ఆనాడే తనను ఆకర్షించాయని, టీడీపీ అందించిన సుపరిపాలన ఇంకా మరువలేకున్నానన్నారు. టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దర్బార్‌బాషా, రవీంద్రనాయుడు, మాజీ కౌన్సిలర్ బొగ్గుల బాష, వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మిప్రసాద్, తరుగు నాగరాజ, ఎస్. పాలకొండదరాయుడు, నూనె లక్ష్మినారాయణ, మాసాపేట శేఖర్, శ్రీను, గొల్లపల్లి రవి, అల్లాబకష్, ఇబ్రహీం, షబ్బీర్ ట్రాక్టర్ పీరు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి వైపు వైసీపీ నేత చూపు?

పెనగలూరు, ఏప్రిల్ 23 : మండలంలోని నల్లపురెడ్డిపల్లెకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులురెడ్డి ఎన్డీయే కూటమి వైపు చూస్తున్నట్లు సమాచారం. మండలంలోనే బలమైననాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీనివాసులురెడ్డిని కూటమిలో చేర్చుకునేందుకు నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి రూపానందరెడ్డితో పాటు, పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆయనను ఎలాగైనా కూటమిలో చేర్చుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని ఆశిస్తున్నారు. ఈ విషయంపై శ్రీనివాసులురెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా రూపానందరెడ్డి తనకు ఫోన్‌చేసి కూటమిలో చేరాలని కోరినమాట వాస్తవమేనని, అయితే తాను తన వర్గీయులు, బంధుమిత్రులతో సమాలోచనలు జరిపిన తరువాత నిర్ణయం ప్రకటిస్తామని సమాధానమిచ్చినట్లు ఆయన వివరించారు.

'నల్లారి నామినేషన్‌కు తరలిరండి'



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేష్

రాజంపేట, ఏప్రిల్ 23 : రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో నామినే షన్ వేయనున్నారని, ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు, శ్రేయోభిలాషులు పాల్గొనాలన్నారు. నామినేషన్ అనంతరం రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహించు ర్యాలీలో అందరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, డాక్టర్ రాంప్రసద్, మైనారిటీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, హిమగిరియాదవ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం ఉధృతం చేద్దాం : కస్తూరి



మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

చిట్వేలి, ఏప్రిల్ 23 : ఎన్డీఏ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ఉధృతం చేయాలని రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు కె.కె. చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా ప్రచారాన్ని ఉధృతం చేయాలన్నారు. వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తన సహకారం ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

గాలివీడు, ఏప్రిల్ 23: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా మూలపల్లె, మాలపల్లె, నడింపల్లి, బలిజ పల్లె, అరవీటి వాండ్లపల్లె, మాదిగపల్లె, నాయునివారిపల్లెల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో అన్న మయ్య జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు, బీటీ ఆంజనేయులు, గాలివీడు మండల బీజేపీ అధ్యక్షుడు గొట్లమిట్ట శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు సీనియర్ నాయకులు రాజకుమార్ పాల్గొన్నారు.

పులపత్తూరులో టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం



ప్రచారంలో గన్నె సుబ్బనరసయ్యనాయుడు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 23 : మండ లంలోని పులపత్తూరు గ్రామంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. రాజంపేటలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపిం చాలన్నారు. బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున రాజు, శివ, వెంకట్, అరుణాచలం, ఈశ్వరయ్య, సాంబశివయ్య, కొల్లా వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లారి సమక్షంలో పలువురు బీజేపీలో చేరిక



నల్లారి సమక్షంలో బీజేపీలో చేరిన యువత

నందలూరు, ఏప్రిల్ 23 : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ గొల్లపల్లె, అరవపల్లె, నాగిరెడ్డిపల్లె ప్రాంతాల పరిధి లోని పలువురు రాయచోటిలోని అజయ్ కన్వె న్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన నాయకుల సమావేశంలో రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర బీసీ సంఘ కార్యదర్శి, అఖిల భారత యాదవ మహా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపినేని హిమగిరినాథ్ యాదవ్, హెచ్.దేవేంద్ర ప్రసాద్‌లతో పాటు దాదాపు 60 మంది యువత వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, అరవేటి చంద్రశేఖర్‌రాజు, గురుపాటి చినరాయులు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడికి నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ



రాయచోటి కోర్టు వద్ద విధులు బహిష్కరించిన నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 23: కడప కోర్టులో బాధితుల తరఫున సివిల్ కేసు దాఖలు చేసి, వారికి అండగా నిలిచినందుకు ప్రతివాదులు న్యాయవాది పీ. శివసుధాకర్‌పై దాడి చేసినందుకు నిరసనగా మంగళవారం రాయచోటి కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీ. రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి డీ. నాగముని విలేకరులతో మాట్లాడుతూ డీ. సుహాసిని అనే మహిళకు సంబంధించిన కేసులో శివసుధాకర్ అనే న్యాయవాది మార్చి 14న కడప కోర్టులో ఇంజక్షన్ ఆర్డరు తీసుకున్నారు. అయినా, నిందితులు దౌర్జన్యం ఆపకపోవడంతో బాధితురాలు కడప ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనంతటికీ కారణం లాయరేన్న ఉద్దేశంతో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో ఎర్రముక్కపల్లె క్రాస్ వద్ద సుబ్బమ్మ, హరి, హరిప్రసాద్, సునీత దాడి చేయగా, అతని వెన్నెముక దెబ్బతిన్నదన్నారు. దాడి చేసిన వారిలో సునీత అనే మహిళకు రాజకీయ పలుకుబడి ఉండడంతో పోలీసులు ఆమె పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్‌రాజు, ఆనంద్‌కుమార్, చిన్నయ్య, కృష్ణయ్య, దేవేంధర్‌రెడ్డి, హుమయూన్‌బాషా, భరత్‌కుమార్‌రెడ్డి, రెడ్డిబాషా, మిఠాయిగిరి ఖాదర్‌బాషా, రవిశంకర్, నిరంజన్, వరలక్ష్మి, ఖుష్ణుమా, ఖిజర్‌అలీఖాన్, ఉత్తేజ్‌కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

జిల్లా కేంద్రానికి.. ఎన్నికల పోలీస్ పరిశీలకుడు



పోలీసు పరిశీలకుడికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 23: అన్నమయ్య జిల్లాకు సార్వత్రిక ఎన్నికల పోలీస్ పరిశీలకుడుగా నియమితులైన దిల్ నవాజ్ అహ్మద్ ఐపీఎస్ మంగళవారం అన్నమయ్య జిల్లాకు వచ్చారు. ఎస్పీ కృ ష్ణారావు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్ల వివరాలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా లో ప్రజలందరూ శాంతియుత వాతావ రణంలో నిర్భయంగా ఓటు హక్కు విని యోగించుకునేలా చర్యలు తీసుకుంటామ న్నారు. శాంతి భద్రతలపై ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని, తన ఫోన్ నెంబర్ 89779 46222కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపవచ్చునన్నారు.

26 నుంచి యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



యల్లమ్మ ఆలయం

సుండుపల్లె, ఏప్రిల్ 23: ఈ నెల 26 నుంచి యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెన్నంశెట్టిపల్లి గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపంలో నిర్మించిన ఆలయంలో ఈ నెల 26వ తేదీ గణపతి పూజ, రక్షా బంధనము, కలశ స్థాపన, నవగ్రహ పూజలు నిర్వహించనున్నారు. 27న అమ్మవారి గ్రామో త్సవం, 28న ధ్వజస్థంభ, శిఖర, కలశ, ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని గ్రామస్తులు కోరారు.

అగస్త్యేశ్వరాలయంలో పూజలు



గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని దాక్షాయణి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం మహాగణపతి హోమం చేశారు. పార్వతీ పరమేశ్వరుల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త భక్తవత్సలం, కమిటీ సభ్యులు శివకార్తీక్, సుదర్శన్, రమణ, వీరభద్రాలయ దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మీప్రసాద్‌ల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గంగా భవాని అమ్మవారికి పూజలు



గంగా భవాని అమ్మవారి ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం

సిద్దవటం, ఏప్రిల్ 23 : మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారుపేటలోని గంగాభవాని ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పార్వతీపురం, ఉప్పరపల్లి, కొత్త మాధవరం, బంగారుపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

పెనగలూరు, ఏప్రిల్ 23 : హనుమత్ జయంతి సందర్భంగా ఈటిమాపురం గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విరాట్‌కు మహిళలు నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం ఆకు పూజ నిర్వహించి భక్తిని చాటుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 23: అనారోగ్యంతో ఓ రైతు ఆత్మ హత్య చేసుకున్నాడు. ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు వెంకటరమణ(53) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు అతడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 23: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇక ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకని బాగా చదువుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సి పాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి సూచించారు. మంగళ వారం స్థానిక పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్ఎండి అక్రమ్ 578, పసుపులేటి గిరిధర్ 569, పుసుపులేటి అఖిల 552 లకు అభినందనలు తెలిపారు. ప్రతి ఏడాది మోడల్ స్కూల్ నుంచి మంచి ఫలితాలు సాధించి ఏపీఆర్‌జేసి, ట్రిపుల్ ఐటీకిఎంతో మంది విద్యార్థులు ఎంపిక య్యారని, ఈ ఏడాది కూడా ముగ్గురికి ట్రిపుల్ ఐటీలో సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది కూడా మంచి ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, ఆధ్యాపకులు నిత్యపూజయ్య, సుధాకర్, రాజ్‌కుమార్, విజయ కుమారి, శ్రీనివాసులు, జమ్రుద్‌బేగం, సుమీయా, సుజాతమ్మ, శ్రీకళ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మదరసా దారుల్ ఉలూమ్ ఇందాదియాలో అడ్మిషన్లు ప్రారంభం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని ఠానా వద్ద గల మదరసా దారుల్ ఉలూమ్ ఇందాదియాలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ముఫ్తి సయ్యద్ మసూమ్ సాఖిబ్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక మదరసాలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం దారుల్ ఉలూమ్ ఇందాదియా మదరసాలో నూరాని-ఖాయిదా, నాజిరా ఖురాన్, హిఫ్జ్, ఫారాసీ, దర్సే నిజామి, మౌల్వి తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మదరసాలో చేరే విద్యార్థులకు ఉచిత భోజన వసతి, వైద్య సదుపాయం, హాస్టల్ వసతి ఉన్నాయన్నారు. దీనియాత్ చదివే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సిలబస్ ప్రకారం హైస్కూల్ వరకు ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి పరీక్షలు రాయిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను మదరసాలో నమోదు చేయించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9441432607, 9030272740, 8500962886, 9160746484 అనే నెంబర్లను సంప్రదించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదరసా ఉపాధ్యాయులు ఖారీషాకీరుల్, ఆసద్‌హుస్సేన్, హిదాయతుల్లాఖాన్, షహీన్‌షావలిబేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



రహమత్‌బీని సత్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

చిన్నమండెం, ఏప్రిల్ 23: మల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో గత 11 ఏళ్లుగా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న రహమత్‌బీ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు శివనాయక్, ఆంజనేయులు గత 37 ఏళ్లుగా విద్యాశాఖకు అంకిత భావంతో ఆమె చేసిన సేవలను కొనియాడారు. హెచ్ఎం రెడ్డెన్న, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అటెండరు రూపాయి లంచం

- నైతిక బాధ్యత వహించి మద్రాసు ప్రావిన్స్ పీఎం రాజీనామా
- నాడు నైతిక విలువలకు పెద్దపీట వేసిన చిత్తూరుజిల్లావాసి

● చిరస్మరణీయులు




బొల్లిని మునస్వామి నాయుడు

తమపై వేల రూ.కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా ఇప్పటి నేతలు పదవులను పట్టుకుని వేలాడుతూనే ఉన్నారు. అక్ర మాస్తుల కేసులున్నా వెరవడంలేదు. పైగా నీతి బోధనలు చేస్తు న్నారు. కానీ.. తన వద్ద పనిచేసే ఒక అటెండరు రూపాయి లంచం తీసుకున్నాడని మద్రాస్ ప్రావిన్స్ ప్రధానమంత్రి పదవికే రాజీనామా చేశారు బొల్లిని మునస్వామి నాయుడు. నాడు నైతిక విలువలు పాటించి.. నేటి తరానికీ ఆదర్శంగా నిలిచిన ఆయన చిత్తూరు జిల్లాకు చెందిన వారు. చిత్తూరు సమీపం వేపంజేరిలో 1885 ఏప్రిల్‌లో బొల్లిని మునస్వామి నాయుడు జన్మించారు. 1908లో న్యాయవాద వృత్తిలో డిగ్రీ పొందారు. సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించి మంచి పేరు పొందారు. 1920లో చిత్తూరు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా, 1918లో 16వ చిత్తూరు మండల మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా, 1921లో చిత్తూరు మున్సిపల్ ఛైర్మన్‌గా, 1923 నుంచి చిత్తూరు జిల్లా బోర్డు (జిల్లా పరిషత్) అధ్యక్షుడిగా పనిచేశారు. మద్రాసు విశ్వవి ద్యాలయ సభ్యుడిగానూ కొనసాగారు. 1919-25 మధ్య మద్రాసు శాసనసభ సభ్యుడిగా, 1930లో మద్రాసు ప్రావిన్స్ ప్రధానమం త్రిగా ఎన్నికై 1934వరకు కొనసాగారు. అప్పట్లో ఈ పదవిని ప్రధానమంత్రి అనేవారు. తమ గ్రామాల సమీపంలోని అడవుల్లో పశువులు మేపుకొనేందుకు ఆయన అనుమతించారు. ఈయన ప్రధానమంత్రిగా పనిచేస్తున్న రోజుల్లో ఓ అటెండరు రూపాయి లంచం తీసుకున్నట్లు శాసనసభలో బయటపడింది. దీనిపై విచా రణ జరిపితే నిజమని తేలింది. వెంటనే ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి జట్కాబండిలో ఇంటికి వెళ్లారట. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించిన ఆంగ్లేయులు 1926లో 'దివాన్ బహదూర్' పురస్కారంతో సత్కరించారు.

- చిత్తూరు కలెక్టరేట్

● గాసిప్

శిష్యవాత్సల్యం



పూర్వాశ్రమంలో కాంగ్రెస్ పార్టీలో ఒక్క వెలుగు వెలిగిన పెద్దాయన. కాలం కలిసి రాక వైసీపీలో చేరి, టీడీపీ మీదుగా తిరిగి సొంతగూటికే చేరారా మధ్య. పార్టీల మధ్య దూకే సమయాల్లో రాజకీయ సన్యాసం గురించి కూడా ఆలోచించారేమో.. చాలా గ్యాప్ తీసేసుకున్నారు. ఈయనతోనే ఉన్న ప్రియశిష్యుడు ప్రస్తుతమున్న పార్టీని వీడి, పూర్వ కాంగ్రెస్‌లోకి జంప్ చేసి.. కుప్పం అభ్యర్థి అయిపో యారు. ఈ క్రమంలో ఇటీవల తమ పార్టీ ప్రచార యాత్ర ప్రారంభించిన ఈ పెద్దాయన శాంతిపురం మండలంలోని రెండు గ్రామాలకు వెళ్లారు. ఆ గ్రామాలలో ఆయన శిష్యుడి సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువ. పూర్వాశ్రమంలో అతడు తనకిచ్చిన గట్టి మద్దతు, అప్పట్లో జిల్లా స్థాయి పదవి పొంద డంలో కూడగట్టిన పార్టీ శ్రేణుల సహకారం.. ఆయన కళ్ల ముందు కదిలిందేమో? శిష్య వాత్సల్యం ముంచుకొచ్చింది. తాను ప్రస్తుతమున్న పార్టీని, ఆ పార్టీ ప్రచారాన్ని మరచిపోయా రాయన. తన శిష్యుడికి ఓట్లేయాల్సిందిగా ఆ సామాజికవర్గం వారిని కోరివచ్చారట. కేవలం తన శిష్యుడైనంత మాత్రానికే, డిపాజిట్టు కూడా దక్కుతుందో లేదో తెలియని పార్టీ అభ్యర్థికి ఓట్లేయమని అడిగి వచ్చిన పెద్దాయన శిష్యవాత్సల్యం ఇప్పుడు శాంతిపురం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుత పార్టీ పెద్దలకు ఈ విషయం తెలిస్తే రాజకీయ మనుగడకు ప్రమాదమని తెలి సినా గురువుగా ఆయన చూపించిన తెగువకు శిష్యగణం కళ్లు చెమరుస్తున్నాయి. 'అదీ.. గురువంటే అలా ఉండాలి' అంటూ వాళ్లు ఆనందబాష్పాలను కారుస్తున్నారట.

- కుప్పం

చెడిపోయిన రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత, నిజాయతీ అనే పదాలు రావాలి. ఏ రాజకీయ నాయకుడైనా ఒక పని చేస్తానని చెప్పి చేయకపోతే.. తన పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తేవాలి. మోసం చేసేవాడు.. అబద్ధాలు చెప్పేవాడు.. మీకు నాయకుడిగా కావాలా..? ఆలోచించుకోండి.

- ఆరేళ్ల కిందట జిల్లాలో పాదయాత్ర చేస్తూ జగన్ చెప్పిన మాటలు ఇవి.

ప్రతిపక్ష నేతగా.. అధికారంలోకి రాగానే చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తాం. ఆ డెయిరీకి పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 చొప్పున రాయితీ ఇస్తామని చెబుతున్నా. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించి చెరకు రైతుల కష్టాలు తీరుస్తా.

- 2018 జనవరిలో పాదయాత్ర సందర్భంగా జగన్ చెప్పిన మాటలివి.

ముఖ్యమంత్రిగా.. చిత్తూరు విజయా డెయిరీని అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేసి, ఇదే పునరుద్ధరణ అంటే ఎలా? ఇక, చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ ఊసేలేదు. విపక్ష నేతగా ఇచ్చిన మాటను.. సీఎంగా నిలబెట్టుకోలేదు. నాడు మీరు వల్లించిన విశ్వసనీయత అంటే ఇదేనా?

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు



ఇదేనా విశ్వసనీయత జగన్?

- విపక్ష నేతగా విలువలు, చెప్పింది చేయడంపై పెద్దపెద్ద మాటలు చెప్పారు
- సీఎంగా నెరవేర్చారా



● విజయా డెయిరీ

'అమూల్'కు కట్టబెట్టేసి

పునరుద్ధరణ అంటే ఎలా?

అధికారంలోకి రాగానే చిత్తూరు విజయా డెయిరీని పునరుద్ధరిస్తానని మాట ఇచ్చి.. అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేశారు. దీనినే పునరుద్ధరణ అంటూ సీఎం జగన్ గొప్పగా చెప్పడంపై జిల్లా పాడి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఈ డెయిరీకి చెందిన 27 ఎకరాల భూములు, ఇతర ప్రాంతా ల్లోని ఆస్తుల విలువ సుమారు రూ.500 కోట్లు. ఇంత ఆస్తిని ఏడాదికి కేవలం రూ.కోటి చొప్పున ఏకంగా 99 ఏళ్ల లీజుకు అమూల్ సంస్థకు అప్పగించేశారు. ఇదే అమూల్ మాకొ ద్దని కర్ణాటక, తమిళనాడు సీఎంలు తెగేసి చెప్పారు. సీఎం జగన్ మాత్రం దాన్ని చంకనె త్తుకున్నారు. పైగా పాడి రైతులకు చేస్తున్న గొప్ప కార్యక్రమంగా చెప్పుకుంటున్నారు.

డెయిరీ ఉద్యోగులను పట్టించుకోని పాలకులు

అమూల్‌కు అప్పనంగా డెయిరీ ఇచ్చేసిన సీఎం జగన్ ఆ సంస్థ ఉద్యోగులను పట్టించుకోలేదు. జీతాలు రాలేదని డెయిరీ కార్మికులు(టైమ్ స్కేల్ ఉద్యోగులు) 221 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తూనే ఉన్నారు. 140 మందికి రూ.63 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నా పట్టించుకునే వాళ్లే కరువయ్యారు.విజయా డెయిరీని 'అమూల్'కు కట్టబెట్టేందు కు చూపిన ఉత్సాహం..ఉద్యోగుల జీతాలపై చూపకపో వడం మానవీయమేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



తీపి మాటలు.. చేదు చేతలు

చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ హామీ గాలికే

చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరి స్తానని హామీనిచ్చిన జగన్.. ఈ ఐదేళ్లలో పట్టించుకోలేదు. గతే డాది ఈ రెండు ఫ్యాక్టరీల ఆస్తులు, అప్పులు తేల్చడానికి లిక్విడేష న్ ప్రక్రియను ప్రారంభించారు. ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం బకాయిలను చెల్లించారు. ఈ రెండు ఫ్యాక్టరీలు ఉన్నప్పుడు జిల్లాలో రైతులు 54 వేల హెక్టార్లలో చెరకును సాగు చేసేవారు. ఇప్పుడు సాగు సగానికి సగం తగ్గింది.

చిత్తూరు ఫ్యాక్టరీ పరిస్థితి

చిత్తూరు కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ 1964లో ప్రారంభమైంది. 2003-04 వరకు 16 వేల మంది రైతులతో ఓ వెలుగు వెలిగింది. తరువాత క్రమంగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2014-15లో క్రషింగ్ చేయకుండా ఆపేసింది. క్రమంగా మూత పడింది. మూతపడే సమయానికి రైతులకు బకాయిపడిన రూ.13 కోట్లను టీడీపీ ప్రభుత్వం చెల్లించేసింది. దీనిని తెరిపిస్తా నని జగన్ హామీ ఇస్తే చెరకు రైతులు, సంస్థ ఉద్యోగులు సంబర పడ్డారు. ఈ అయిదేళ్లూ హామీ అమలుకు సీఎం కనీస ప్రయత్నం కూడా చెయ్యకపోవడంతో మోసపోయామని రైతులు, సంస్థ ఉద్యోగులు గుర్తించారు.

ప్రైవేటు ఫ్యాక్టరీలతో రైతులకు తీవ్ర నష్టం

జిల్లాలోని ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యం ఇష్టాను సారం పర్మిట్లు ఇవ్వడంతో ఓ రకంగా, బిల్లులు సకాలంలో అందిం చకపోవడంతో మరో రకంగా రైతులు నష్టపోతున్నారు. ఈ ప్రైవేటు ఫ్యాక్టరీలు కుమ్మక్కై మద్దతు ధర విషయంలో రైతులకు అన్యాయం చేసిన సందర్భాలున్నాయి. నేతమ్స్, మయూర చక్కెర కర్మాగారాలు మూడేళ్లుగా రూ.కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో, రైతులు అప్పులపాలయ్యారు. మరికొందరు అప్పులు చెల్లించలేక భూములను అమ్ముకున్నారు.

సహకార ఫ్యాక్టరీతో లాభాలు

సహకార ఫ్యాక్టరీల్లో సీనియారిటీ ప్రకారం రైతులకు పర్మిట్లు అందేవి. రైతు కూడా భాగస్వామి కావడంతో లాభాల్లో వాటా వస్తుంది. సహకార సిబ్బంది రైతుల పొలాల వద్దకు వచ్చి చెరకు పంటలో చక్కెర శాతాన్ని పరీక్షించి పర్మిట్లు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రైవేటు యాజమాన్యం ఇలా చేయకుండా, వెనుక పంట ముందుగా, ముందేసిన పంట ఆలస్యంగా క్రషింగుకు తీసు కుంటున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసినా బిల్లుల రావడం లేదు. సహకార ఫ్యాక్టరీలు మూత పడడంతో ఇలా అన్ని విధా లుగా రైతులు నష్టపోతున్నారు.

డెయిరీ మూతకు కారణమేంటి?

తన హెరిటేజ్ కోసం నాడు చిత్తూరు డెయిరీని చంద్రబాబు మూసివేయించారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కానీ.. మూతపడటానికి కార ణాలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో 1990-2000 మధ్య అనేక సహకార డెయిరీలు మూత పడ్డాయి. దీనికి ప్రధాన కారణం 1992లో కేంద్రం మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ (ఎంఅండ్‌పీవో) జారీ చేసి, ప్రైవేటు డెయిరీలకు అవకాశం కల్పించింది. అప్పటికే ఆపరే షన్ ఫ్లడ్3 ద్వారా యూరప్ నుంచి వచ్చిన పాలపొ డిని ఉచితంగా సరఫరా చేసింది. దీంతో పాల ధర తగ్గి, డెయిరీలు నష్టాల బారిన పడ్డాయి. చిత్తూరు డెయిరీ పాలను ఏడాదిలో ఏడు నెలలే ఏపీ డెయిరీ ఫెడరేషన్ కొనేది. మిగతా రోజుల్లో ఆవు పాల వంకతో కొనేది కాదు. ఏడాదంతా కాంట్రాక్టు ఇచ్చేది కాదు. పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవడానికి రాష్ట్ర యూనియన్ అనుమతి ఇచ్చేది కాదు. చిత్తూరు డెయిరీ రోజుకు 2.75 లక్షల లీటర్లు సేక రిస్తే 1.60 లక్షల లీటర్లే కొన్న పరిస్థితి. అప్పట్లో డెయిరీకి తిరుపతి మినహా ఇతర పట్టణాల్లో పెద్దగా మార్కెట్ లేదు. టీటీడీ కిలో నెయ్యి రూ.45 చొప్పున టెండర్లు ఇచ్చేది. కానీ కిలో నెయ్యి వ్యయం రూ.54 దాకా ఉండేది. ఈ కారణాలతో సంస్థకు 1991 నాటికే రూ.కోట్లలో నష్టం వచ్చింది. 1993లో హెరిటేజ్ పెట్టే నాటికి చిత్తూరు డెయిరీ నష్టాల్లో కూరుకుపోయింది. 1992లో ఎంపీవో (డీ లైసె న్సింగ్) ద్వారా కేంద్రం ప్రైవేటు రంగాన్ని ప్రోత్స హించింది. ఫలితంగా చిత్తూరు జిల్లాలోనే 32 మిల్క్ చిల్లింగ్ సెంటర్లు నెలకొల్పారు. ప్రస్తుతం జిల్లాలో 10 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతు న్నాయి. 30 ప్రైవేటు డెయిరీలున్నాయి.

పాడి రైతులకు అన్యాయం



కోట్లాది రూపాయలు విలువచేసే విజయా డెయి రీని ప్రైవేటు సంస్థకు ఇస్తే తిరిగి రాదని అప్పుడే చెప్పాను. అమూల్ సంస్థకు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఒంటరి పోరా టాలు చేశాను. మంత్రులను సభల్లో ప్రశ్నించాను. సీఎం జగన్ చిత్తూరుకు వచ్చిన ప్పుడు నిరసన తెలుపుతానని తెలిసి పోలీసులు నన్ను హౌస్ అరెస్టు చేశారు. అమూల్ సంస్థకు డెయిరీని అప్పగిం చడం పాడి రైతులకు అన్యాయం చేయడమే.

- ఈదల వెంకటాచలం నాయుడు, ఉద్యమకారుడు, జిల్లా పాడి రైతుల సంఘం

ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సరికాదు



విజయా డెయిరీని అమూల్ ప్రైవేటు సంస్థకు అప్పగించడం సరికాదు. దీని వల్ల రైతులకు బాగా నష్టం కలుగుతుంది. డెయిరీని కోఆపరేటివ్ సొసైటీకి అప్పగించి ఉంటే రైతు లకు కొంత ప్రయో జనం ఉండేది. ప్రభుత్వ యాజమాన్యంలో గిట్టు బాటు ధర ఉండేది. ఇప్పుడు ప్రైవేటు సంస్థ నిర్ణ యించినదే పాల ధర. దీని ద్వారా రైతులకు నష్టం తప్ప, లాభం ఉండదు.

- ఎ.రాధిక, పాడి రైతు, చిత్తూరు రూరల్

మా బతుకులు రోడ్డున పడ్డాయి



డెయిరీలోని 140 మంది వర్కర్లకు రూ.63 కోట్లు బకాయిలు ఇంత వరకు రాలేదు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మా బతుకులు రోడ్డున పడుతున్నాయి. 220 రోజులకు పైగా డెయిరీ ముందు దీక్ష చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ ఆస్తిని అతి తక్కువ ధరకు విజయా డెయిరీని ప్రభుత్వం ప్రైవేటు సంస్థ లకు అప్పగించింది.

- పీడీ కుమార్, టైంస్కేల్ వర్కర్, విజయా డెయిరీ

కుప్పం వర్తమానం

ఒకరు మాజీ సర్పంచి. మరొకరు ప్రస్తుత సర్పంచి భార్య. ఇద్దరికీ అధికార పార్టీలో అవమానాలే ఎదురయ్యాయి. చేసిన కష్టానికి తగిన గుర్తింపు దక్కలేదని ఒకరు, సొంత పార్టీ నాయకుల భూ కబ్జాలు, దందాలు భరించలేక మరొకరు.. రెబల్ అభ్యర్థులుగా నిలిచారు. ఒకరు వైసీపీ అభ్యర్థిగానే నామినేషన్ వేస్తే మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి వైసీపీ ప్రకటిత అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌ను సవాల్ చేస్తున్నారు.

- కుప్పం

వైసీపీకి రెబల్స్ దెబ్బ!

- ఎదురు తిరిగిన ఆ ఇద్దరూ





ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నీలావతి - వసనాడు మురళి

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అంతకంతకూ పుంజుకుంటోంది. గ్రామగ్రామానా ఆ పార్టీకి ప్రజల మద్దతు పెరుగు తోంది. పార్టీ తలపెడుతున్న ప్రచారాలు, కార్యక్రమా లకు జనం వెల్లువెత్తుతున్నారు. ఈనెల 19న చంద్ర బాబు తరఫున నామినేషన్ వేసిన ఆయన సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్న ర్యాలీకి స్వచ్ఛందంగా తరలి వచ్చిన వేలాదిమంది జనమే దీనికి నిదర్శనం. దీనికి రివర్స్‌లో వైసీపీ పరిస్థితి నియోజకవర్గంలో నానాటికీ దిగజారుతోంది. ఎక్కడికక్కడ పార్టీ, విభేదాలతో కునారి ల్లుతోంది. గోరుచుట్టుమీద రోకలిపోటులా ఇప్పుడు ఆ పార్టీ ప్రకటిత అభ్యర్థి భరత్‌కు ఇద్దరు రెబల్ అభ్య ర్థులు తయారయ్యారు. కుప్పం మండలం వసనాడు వైసీపీ మాజీ సర్పంచి బి.మురళీధర్ అలియాస్ వస నాడు మురళి సోమవారం ఆ పార్టీ అభ్యర్థిగానే పేర్కొంటూ నామినేషన్ వేస్తే, శాంతిపురం మండలం మొరసనపల్లె వైసీపీ సర్పంచి అభ్యర్థి జగదీశ్ భార్య నీలమ్మ అలియాస్ నీలావతి మంగళవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరూ ఎటు వంటి హంగామా, అట్టహాసం లేకుండా ఒకరిద్దరు మనుషులతో వచ్చి నామినేషన్ వేసేసి వెళ్లారు.

పార్టీ నాయకుల తీరుపై తీవ్ర నిరసన

ఐదేళ్ల వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గం ఎటు వంటి అభివృద్ధికీ నోచుకోలేకపోయింది. కుప్పం పట్టణంలో అక్కడక్కడా సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించడం తప్ప పంచాయతీల్లో అభివృద్ధి అనేదే కనిపించకపోవ డంపై ప్రజల్లో ఔఅసంతృప్తి ఉంది. ఇక, వైసీపీ నాయ కుల ఇసుక.. భూదందాలు, క్వారీ అక్రమాలు ప్రజలను చీకాకుపెట్టాయి. దాడులు, దౌర్జన్యాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించాయి. ఇప్పుడు ఇవే మాటలు వైసీపీ రెబల్ అభ్యర్థులు కూడా చెబుతున్నారు. పార్టీకోసం దీర్ఘ కాలంగా కష్టపడినా గుర్తింపు లభించకపోగా, పైస్థాయి లోనే అక్రమాలు, దౌర్జన్యాలు తమను బాధించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమ పంచాయతీ లకు, అక్కడి ప్రజలకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయ లేకపోయామంటున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రస్తుత అభ్యర్థి అయిన భరత్‌పైనే వారు విమ ర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. నామినేషన్‌వేసి వచ్చాక వైసీపీ నేతల దందాలు, భూ కబ్జాలపై నీలావతి గళం విప్పారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అమాయక ప్రజలు బలైపోతున్నారని ధ్వజమెత్తారు. వారి ఆగడాల నుంచి రక్షణ కావాలంటే తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థిం చారు.

అంతర్గత విభేదాలూ ఎక్కువే

పేరుకు నామినేషన్ వేసిన రెబల్ అభ్యర్థులు ఇద్దరే అయినా, పార్టీలో అంతర్గ తంగా ఉన్న నిరసనలు, విభేదాలు చాలా ఎక్కువే. పార్టీ నాయకుల దౌర్జన్యాలను సహించలేక, వారి నిరాదరణకు గురైన పలువురు కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఈ ఇద్దరు రెబల్స్ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో వైసీపీలో మరింత నిరసన సెగ తగలక తప్పదని అటువంటివారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

- కుప్పం

● నోట్ దిస్ పాయింట్

అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం

పలమనేరు..
2,66,935 మంది ఓటర్లు

అత్యల్పం: చిత్తూరు..
2,00,822 మంది

పోలింగ్ కేంద్రాలు: 1771

పలమనేరు: 288 (అత్యధికం)

చిత్తూరు: 226 (అత్యల్పం)

సమస్యాత్మకం

పుంగనూరు: 100 (అత్యధికం)

గంగాధరనెల్లూరు: 34 (అత్యల్పం)



- చిత్తూరు కలెక్టరేట్

ఐదో రోజున మూడు నామినేషన్లు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 23: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో ఐదో రోజున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నామినేషన్లు స్వీకరించారు. ఇందులో భాగంగా ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు ఎస్.జయసింహ, ఆర్ జనార్దన, జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఎం.భాస్కర్ నామినేషన్లు దాఖలు చేశారు.

పీలేరులో మరో నామినేషన్ దాఖలు

పీలేరు, ఏప్రిల్ 23: పీలేరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజాదేశం పార్టీ తరపున ఆసాది వెంకటాద్రి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. పీలేరులోని ఆర్‌వో కార్యాలయంలో మంగళవారం ఆయన తన నామినేషన్ పత్రాలను ఆర్‌వో ఫర్మాన్ అహ్మద్‌కు అందజేశారు.

తంబళ్లపల్లెలో రెండు నామినేషన్లు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 23: తంబళ్లపల్లె శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. తంబళ్లపల్లె నియోజకవర్గం పీటీయం మండలం టీ సదుంకు చెందిన పి.వెంకటరెడ్డి, ఇదే మండలం రంగసముద్రంకు చెందిన ఎం.సురేష్ స్వతంత్ర అభ్యర్థులుగా తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో రాఘవేంద్రకు నామినేషన్ పత్రాలను అందచేశారు.

మద్యం దుకాణాలు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి

పీలేరు, ఏప్రిల్ 23: జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది మంగళవారం పీలేరులోని మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రా నాయక్ నేతృత్వంలో జరిగిన తనిఖీలలో మద్యం దుకాణాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రా నాయక్ సిబ్బందితో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జాగ్రత్తగా మెలగాలని, మద్యం అమ్మకాలపై ఎటువంటి ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. మద్యం అమ్మకాలను నియంత్రించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ మద్యం డిపోతోపాటు జిల్లాలోని దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. దుకాణాల సూపర్‌వైజర్లు మద్యం స్టాకును ఎప్పటికప్పుడు సరిచూసుకుంటే ఎటువంటి అవకతవకలు జరగవన్నారు. ఈ తనిఖీలలో డీటీ జయసింహ, ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణ శాస్త్రి, పోలీస్ ఎస్ఐ గాయత్రి, జీఎస్‌టీ అధికారి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ వీరంగం...!

గుర్రంకొండ, ఏప్రిల్ 23:గుర్రంకొండ పట్టణంలో గంజాయి బ్యాచ్ సోమవారం వీరంగం సృష్టించింది. గంజాయి బ్యాచ్‌లోని కొందరు యువకులు మార్కెట్ యార్డు సమీపంలో ద్విచక్ర వాహనాలను అతివేగం నడుపుతుండగా, పట్టణానికి చెందిన ఓ యువకుడు వారిని వారించాడు. ఈ క్రమంలో గంజాయి బ్యాచ్ సభ్యులందరూ యువకునిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో యువకుని బంధువులు, స్నేహితులు అక్కడ గుమికూడారు. అప్పటికే గంజాయి బ్యాచ్ సభ్యులు విషయాన్ని వాల్మీకీపురం, మదనపల్లె ప్రాంతాల్లో ఉన్న వారికి చెప్పడంతో పెద్ద సంఖ్యలో గుర్రంకొండకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను పంపేశారు. ఈ విషయమై వాల్మీకీపురం సీఐ పులిశేఖర్ వివరణ కోరగా గుర్రంకొండలో గంజాయి బ్యాచ్ ఆగడాలు గురించి తన దృష్టికి వచ్చిందన్నారు. వివరాలను సేకరించి ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలి


కలకడలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


కలికిరిలో ప్రచారం చేస్తున్న నల్లారి అమరనాథ రెడ్డి


పీలేరులో ప్రచారం చేస్తున్న నల్లారి తనూజా రెడ్డి

కలకడ, ఏప్రిల్ 23:ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్తలు పని చేయాలని పీలేరు కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కలకడ మండంలోని గంగాపురం, కెదొడ్డిపల్లె, దేవళ్లపల్లె, రాతిగుంటపల్లె, నవాబ్‌పేట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్ర మైన పీలేరులో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కనుసన్నలో రూ.400 నుంచి 500 కోట్ల భూ ఆక్రమణలు జరిగాయన్నారు. మండలంలో ఓటింగ్ శాతాన్ని పెంచి కూటమి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి, పీలేరు అభ్యర్థి అయిన తనకు ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఇంతియాజ్ అహ్మద్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్, సూర్యప్రకాశ్, అలివేలు, నాగరాజు నాయుడు, వెంకటరమణ, బరకం శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌నాయుడు, వెంకటరమణనాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, రమణ నాయుడు, తిరుపతినాయుడు, మల్లికార్జుననాయుడు, కాంతారావు, బీసీస్వా మి,రవి, చంద్రప్పనాయుడు, ఆనంద్ నాయుడు, పీవీనాయుడు, వసంతనాయుడు, బాలాజిగౌడ్, తారకేశ్వర, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

50కుటుంబాలు టీడీపీలో చేరిక

కలకడ పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీ మైనారిటీ నాయకులు కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీ పీ కండువా కప్పుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు.

గుండ్లూరులో అమరనాథ రెడ్డి విస్తృత ప్రచారం

కలికిరి, ఏప్రిల్ 23: మండలంలోని గుండ్లూరు గ్రామంలో కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు నల్లారి అమరనాథ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంచి పెట్టారు. ప్రచారంలో గుండ్లూరు సర్పంచు షేక్ సైఫుల్లా, మాజీ సర్పంచులు భాస్కర్ రెడ్డి, సతీష్ రెడ్డి, వెంకట్రమణ, సుబ్బయ్య పాల్గొన్నారు. మండలంలోని మర్రికుంటపల్లెలో మంగళవారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, కెవీరెడ్డి, ఆనందరెడ్డి, చిన్నరెడ్డెయ్య, రెడ్డిరాము, భద్రయ్య, పి. భద్రయ్య పాల్గొన్నారు.

మీ ఆదరాభిమానాలను ఓట్ల రూపంలో చూపించండి!

పీలేరు, ఏప్రిల్ 23: ఎన్నికల్లో మీఆదరాభిమానాలు మే 13న జరిగే పోలింగ్ సందర్భంగా ఓట్ల రూపంలో చూపించండంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె పీలేరు పట్టణంలోని సాయిరాం వీధి, సైనిక్ నగర్ ప్రాంతాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు, తన కుమార్తె వైష్ణవి రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, లక్ష్మీకర, సురేంద్ర, శేఖర, హనీఫ్, పురుషోత్తం రెడ్డి, అబ్బవరం సురేశ్, రెడ్డిముని, రహంతుల్లా, పురం రెడ్డమ్మ, సుభద్రమ్మ, లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, స్వర్ణ, చందన, షమ, మీనా, ఖాదర్, శ్రీనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, ఏప్రిల్ 23:గుర్రం కొండ పట్టణానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు మంగ ళవారం టీడీపీ గూటికి చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన ఆదినారాయణ, శంకర, రెడ్డిశేఖర్, పర్వేజ్ అహ్మద్, చింతిర్ల రాజా, సాములు నాయక్, మోహన్‌నాయక్, ఆనంద్, ప్రసాద్, అస్లాం, ఫారుక్, చలపతి, బాష, నయాజ్ అలీఖాన్‌తోపాటు మరో కొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నక్కా సతీష్‌కుమార్, నౌషాద్‌అహ్మద్, మూర్తిరావు, బాలాజి పాల్గొన్నారు.


పీలేరు నుంచి టీడీపీలో భారీగా చేరికలు

కలికిరి, ఏప్రిల్ 23: పీలేరు మండలంలోని యల్లమంద క్రాస్, కావలిపల్లె నుంచి సోమవారం రాత్రి పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. నగరిపల్లెలోని కిశోర్‌కుమార్ రెడ్డి స్వగృహంలో వారంతా పసుపు కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. శ్రీనాథ రెడ్డి, సీక్ష రెడ్డెప్ప, విజయ్, హనీఫ్‌ల ఆధ్వర్యంలో కృష్ణ, చంద్ర, రమణ, శివ, సీఎం రమణ, హనుమంతు, రాంజీ నాయక్, మదన్‌మోహన్, సుబ్బ రాజు, రామాంజులు, రాజా రెడ్డి, వినోద్, సోనూ నాయక్, భారతమ్మ, భాస్కర, ప్రభాస్, రాఘవ, ఓబులేశు, వెంకట్రమణ నాయక్, నారాయణ, యోగ నాయుడు, మునిస్వామి, వెంకట్రమణ, జనార్ధన్, రవి, నాగరాజు, రెడ్డెప్ప, హమీద్, సుబ్బమణ్యం, చిన్నబ్బ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు..

వాల్మీకిపురం, ఏప్రిల్ 23: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో మంగళవారం పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం అభ యాంజనేయస్వామికి వడమాల, తోమాల సేవలు ఆకుపూజ, విశేష అలంకరణలతో భక్తజనం నడుమ పున్నమి వెలుగులో పూజలు నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు వైభవంగా సాగాయి. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: స్థానిక బీటీ కళాశాల గ్రౌండ్‌లోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం చైత్రపౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా. ఆలయావరణలో అన్నదానం చేశారు.


ప్రత్యేకాలంకరణలో వరాలాంజనేయస్వామి

భక్తిశ్రద్ధలతో హనుమద్ జయంతి


ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

రామసముద్రం, ఏప్రిల్ 23: మండలంలోని పలు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలలో మంగళవారం శ్రీరామ భక్త హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆంజనేయస్వామి, రామాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండల కేంద్రం సమీపంలోని గుంటలపేటలో వెలసిన అతిపురాతన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే తిరుమలరెడ్డిపల్లె గ్రామస్థులు చంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కిరణ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపి నేత నీరూప్‌కుమార్‌రెడ్డి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 23: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాజంపేట పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని బీజేపి నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం పుల సరంవాండ్లపల్లె వద్ద టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ..బుధవారం రాయచోటిలో కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ వేయనున్నందున అందరూ తప్పకుండా రావాలని కోరారు. అందరం కలసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డిని, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. రాయచోటిలో నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపి నేతలు నీరూప్‌కుమార్‌రెడ్డి, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మయ్య, టీడీపీ మండల కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, సోముశేఖర్, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర, చలపతినాయుడు, తెలుగుయువత నరసింహులు, వెంకటరెడ్డి, వీరాంజినేయులు, రెడ్డప్ప, జయరాంరెడ్డి, లక్ష్మీనారాయణనాయుడు, శివకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

కురబలకోటలో: కూటమి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని నల్లారి నిరూప్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్ళలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాయచోటిలో ఉదయం 11గంటలకు ఆయన నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ, కూటమి నాయకత్వానికి మద్దతు పలకాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేసి కూటమి అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, వెంకటరమణారెడ్డి, రమణ, నరసింహులు, రమణ, లక్ష్మన్న, గోపాలకృష్ణ, సదాశివ, తెట్టు ఉపసర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలకడ మాజీ ఎంపీపీ ఇంటికి నల్లారి సోదరులు

కలకడ, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలకడ మండల రాజకీయాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీ నాయకుడు, కలకడ మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ అయిన వంగిమళ్ల మధుసూధన్ రెడ్డి ఇంటికి మంగళవారం సాయంత్రం నల్లారి సోదరులిద్దరూ వెళ్లడం ఇందుకు కారణంగా నిలుస్తోంది. సుమారు 15 ఏళ్ల తరువాత నల్లారి సోదరులు మధుసూధన్ రెడ్డి ఇంటికి వెళ్లడం కలకడ మండలంలో మంగళవారం సాయంత్రం సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది.

ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపిద్దాం


అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరసింహులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 23: టీడీపీ, బీజేపీ, జనసేన(ఎన్‌డీఏ)కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం, మదనపల్లెను కొత్త జిల్లా చేసుకుందామని టీడీపీ సీటీఎం క్లస్టర్ ఇన్‌చార్జి చల్లా నరసింహులు పిలు పునిచ్చారు. మంగళవారం సీటీఎం కస్బా, సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతీల్లో బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ టీడీపీకి కంచుకోటలాంటి సీటీఎం రెండు పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నామన్నారు. సీటీఎం పెద్దచెరువు అభివృద్ధికి మాట ఇచ్చిన టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోర్చా నాయకుడు ఓసూరి కిరణ్, మాజీ సర్పంచ్ రెడ్డిస్వామి, చల్లా శ్రీనివాసులు, వేమన్న, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు నాయీబ్రాహ్మణుల కృషి


కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్న నాయిబ్రాహ్మణులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 23: టీడీపీ, జనసేన. బీజేపీ కూటమి అభ్యర్థుల గెలు పునకు కృషి చేయాలని రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికారిక సమితి సభ్యులు, మదనపల్లె నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం నాయీబ్రాహణులు మదనపల్లె కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.షాజ హాన్‌బాషాను కలిసి విజయం కోసం కష్టపడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ పాలనలోనే నాయీబ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందాయని వారు తెలిపారు. ఎమ్మెల్సీ కేటా యించడకపోవడం జగన్‌కే చెల్లిందని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె అసెంబ్లీ ఎం. షాజహాన్‌బాషా అభ్యర్థులు అధిక మెజార్టీలో గెలిపించుకోవడానికి నాయీబ్రాహ్మణుల సహకరించాలన్నారు. కార్యక్రమంలో మంజునథ్, మనోహర్, నరేంద్ర, ఈశ్వర్, నాగరాజ, పాపన్న, మంజు, రామకృష్ణ, నవీన్, మదన్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 23: అనారోగ్యంతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ములకలచెరువు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు వెంకరటమణ(53) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్థాపం చెందిన అతను తన ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు అతడిని 108 వాహనంలో మదనప ల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో వెంకటర మణ మృతి చెందాడు. వెంకటరమణకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదనపల్లె ఎగువకురవంకలో కాంగ్రెస్ ప్రచారం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 23: కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా మంగళవారం ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్ పట్టణంలో ఎగువకురవంకలో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంద న్నారు. మదనపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పవన్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీనాకుమారి, మహబూబ్‌పీర్, పాలేటి, శ్రీనివాసులు, సయ్యద్, మహమ్మద్‌అలీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు రూట్‌లో 30న గిఫ్ట్‌స్కీమ్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 23: మదనపల్లె- గాలీవీడు మార్గంలో ఈ నెల 30న గిఫ్ట్‌స్కీమ్ నిర్వహిస్తున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బస్సులో ప్రయాణించిన తరువాత ప్రయాణికులు తమ పేరు, ఊరుపేరు, ఫోన్‌నెంబరు వివరాలను టికెట్ వెనుకవైపు రాసి బస్సులో డ్రైవర్ సీటు వెనకవైపు ఉన్న బాక్స్‌లో వేయాలని డీఎం సూచించారు. ఈనెల 30న గిఫ్ట్‌బాక్స్ నుంచి లక్కీడిప్ తీసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతలను విజేతలకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

దోమల నివారణకు మందులు పిచికారి

పీలేరు, ఏప్రిల్ 23: దోమలను నియంత్రించేందుకు పీలేరులోని మలేరియా సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్ నేతృత్వంలో తలపుల పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మందులు పిచికారి చేశారు. పట్టణంలోని బాహూజీ నగర్, పద్మావతి నగర్, ఆర్టీసీ బస్టాండు సముదాయం, సబ్-జైలులో మందులు పిచికారి చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతు దోమల నివారణకు మలాథియన్ పౌడర్‌ను తగు మోతాదులో నీటితో కలిపి పరిసరాల్లో పిచికారి చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, బస్టాండు మేనేజర్ బాబు నాయక్, ఆరోగ్య పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్‌ఎంలు విజయకుమారి, లక్ష్మి, రెడ్డిరాణి, సీహెచ్‌వోలు ఆయేషా, సౌజన్య, ఆశాలు పాల్గొన్నారు.